ప్రజాశక్తి

సోమవారం 22 మే 2023 8 పేజీలు

గుంటూరు పల్నాడు





మార్కెట్లోకి బిజి-3 పత్తి విత్తనాలు?

ఖరీఫ్‌కు ముందే అక్రమార్కుల సన్నాహాలు - నిషేధం విధించినా ఆగని విక్రయాలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి



గుంటూరు, పల్నాడు జిల్లాలో నకిలీ పత్తివిత్తనాలు రంగప్రవేశం చేశాయి. నిషేధిత బిజి-3 విత్తనాలను విక్రయాలను రహస్యంగా ప్రారంభించారు. ఈ విత్తనాల సాగును ప్రభుత్వం నిషేధించినా గతకొంత కాలంగా విక్రయాలు, అధికారులు దాడులు చేసి పట్టుకోవడాలు పరిపాటైంది. గతంలో కొంతమంది విక్రయదారుల లైసెన్సులను రద్దు చేసినా రాజకీయ వత్తిడితో పునరుద్ధరించారు. గుజరాత్, కర్ణాటక, తెలంగాణ నుంచి బిజి-3 విత్తనాలు గుంటూరు, పల్నాడు జిల్లాకు వచ్చినట్టు చెబుతున్నారు. వీటిని కొన్ని కంపెనీలు రైతులకు అనుమానం రాకుండా బిజి-2 రకం పత్తి విత్తనాల్లో కలిపి విక్రయించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఏటా రూ.50 కోట్ల వరకు విత్తనాలు విక్రయిస్తారని అంచనా. వ్యవసాయ, విజిలెన్సు అధికారులు అడపాదడపా దాడులు నిర్వహించినా వీటి మూలాలను మాత్రం నియంత్రించలేకపోతున్నారు. గుజరాత్‌తో పాటు కొంత భాగం కర్ణాటక నుంచి కూడా ఎక్కువగా బిజి-3 విత్తనాలు వస్తున్నట్టు తెలిసింది. గతంలో వ్యాపారులు, తయారీ, రవాణా దారులపై కేసులు నమోదు చేశారు. ఈ ఏడాది ఇప్పటికే పెద్ద ఎత్తున జిల్లాకు దిగుమతి అయ్యాయి. లేబుల్స్ లేకుండా గన్నీ బ్యాగ్స్‌తో కొంతమంది రవాణ చేస్తున్నారు. మరికొంత మంది కొత్త లేబుల్స్‌తో పలు కంపెనీల పేరుతో నకిలీ విత్తనాలను తెస్తున్నారు. తక్కువ ధరలకు మంచి ఎక్కువ దిగుబడి వచ్చే విత్తనాలంటూ రైతులను నమ్మిస్తున్నారు. వీటిని విక్రయించడం వల్ల కూడా వ్యాపారులకు, దళారులకు మంచి లాభాలు ఆర్జించే అవకాశం కల్పిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ప్రతి ఏటా ఐదు లక్షల ఎకరాల్లో పత్తి పండిస్తారు. అయితే రైతులే స్వయంగా విత్తనాలను తయారు చేసుకునే అవకాశం ఉన్నా వ్యవసాయ శాఖ ఆ దిశగా రైతులను చైతన్యవంతం చేయలేకపోతోంది. అధిక దిగుబడి వస్తుందని, నాణ్యత కల్గిన విత్తనాలు విక్రయిస్తామని చెబుతూ రకరకాల లేబుల్స్‌తో విత్తనాల విక్రయిస్తున్నారు. రాష్ట్రంలో కర్నూలు, ప్రకాశం జిల్లాల నుంచి కూడా నకిలీ పత్తి విత్తనాలు జిల్లాకు వస్తున్నట్టు చెబుతున్నారు. బిజి-3 విత్తనాల సాగు వల్ల భూసారం దెబ్బతింటుందని, వరుసగా నాలుగేళ్ల పాటు ఈ విత్తనాలను సాగు చేయడం వల్ల భవిష్యత్తులో పంటలు సాగుచేయలేని పరిస్థితి ఏర్పడుతుందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. వ్యవసాయశాఖ అధికారులు నిర్లిప్తత వల్లే బిజి-3 విత్తనాల విక్రయం, రవాణా యథేచ్ఛగా సాగుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తం అవుతున్న నేపథ్యంలో నిషేధిత విత్తనాలు జిల్లాలను ముంచెత్తడంపై రైతుల్లో ఏదీ అసలు...ఏది నకిలీనో తెలియని పరిస్థితిలో ఉండిపోతున్నారు. జిల్లాలో ప్రతి ఏటా ఏదో ప్రాంతంలో నకిలీ విత్తనాలు వచ్చి రైతులు నష్టపోతూనే ఉన్నారు.

కలెక్టరేట్ వద్ద నేడు ఉపాధి హామీ కూలీల ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు

ఉపాధి హామీ కూలీలకు బకాయి వేతనాలు చెల్లించాలని, ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షణ కోసం, ఉపాధి హామీ పని ప్రదేశాల వద్ద మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించే ధర్నా,ఉ జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన జారీ చేశారు. వ్యవసాయ పనులు లేని సమయంలో కూలీలకు ఉపాధి హామీ చట్టం ఊతంగా ఉందని, అయితే ఈ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ప్రభుత్వాలను విమర్శించారు. జిల్లాలో గతేడాది రావలసిన పెండింగ్ వేతనాలు రూ.1,69,47,381లు వెంటనే చెల్లించాలని, రెండు పూటలా పని రద్దు చేయాలని, సమ్మర్ అలవెన్స్ 40 శాతం ఇవ్వాలని, 100 రోజులు పూర్తి చేసిన కుటుంబానికి అదనంగా పని చూపాలని, గ్రామాలతో పాటు పట్టణాలలో కూడా ఉపాధి హామీ పనులు కల్పించాలని, పనిచేసే చోట కనీస సౌకర్యాలైన టెంటు, తాగునీరు, మెడికల్ కిట్లు ఇవ్వాలని, తాగునీటికి రూ.10, పనిముట్లు సాన పెట్టుకోవడానికి రూ.50, తట్టకు రూ.20 రూపాయలు ఇవ్వాలని కోరారు. ఆన్‌లైన్ మస్టర్ విధానం రద్దుచేసి, పాత పద్ధతిని అమలు చేయాలని, వేతనాలు చెల్లించేటప్పుడు పేస్లిప్పులు ఇవ్వాలని, క్షేత్రస్థాయి మేట్లకు స్మార్ట్ ఫోన్ రూ.5 పారితోషికం ఇవ్వాలని, తాడేపల్లి మంగళగిరి కార్పొరేషన్ పరిధిలో విలీన గ్రామాలకు, రాజధాని ప్రాంత గ్రామాలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై చేపట్టే ధర్నాలో కూలీలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మోడీని జయించే సత్తా బిఆర్ఎస్‌కు ఉంది

పార్టీ రాష్ట్ర కార్యాలయాన్ని ప్రారంభించిన తోట చంద్రశేఖర్

మెయిన్‌లో



డ్రోన్ పనితీరును పరిశీలిస్తున్న మంత్రి విడదల రజిని

మీభూమి.. మా హామీ సర్వే ప్రారంభం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

జగనన్న శాశ్వత భూ హక్కు - భూ రక్ష పథకంతో భూ అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు వీలేర్పడిందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. మీ భూమి - మా హామీ కార్యక్రమం కింద పట్టణంలో చేపడుతున్న భూ సర్వేను మంత్రి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డ్రోన్ పనితీరును పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ భూ రక్ష పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 90 లక్షల మంది రైతులకు మేలు జరుగుతుందన్నారు. గట్టు తగాదాలు ఇకపై ఉండబోవని, భూ వివాదాలకు ఇది శాశ్వత పరిష్కారమని చెప్పారు. బలవంతులు ఎవరి భూమినైనా ఆక్రమిస్తే.. ప్రభుత్వమే ఆ భూమిని విడిపించి బాధితులకు అందజేసే గొప్ప కార్యక్రమన్నారు. 22.6 కోట్ల వ్యవసాయ భూమి, గ్రామాల్లో 85 లక్షల ఆస్తులు, పట్టణాల్లో 40 లక్షల స్థిరాస్తులు, 10 లతక్షల ప్లాట్లకు ఈ సర్వే జరుగుతుందని వివరించారు. సర్వే పూర్తయితే భూ రికార్డులన్నీ డిజిటల్ రూపంలో అందుబాటులో ఉంటాయని, శాశ్వత భూ హక్కు పత్రాన్ని కూడా ప్రభుత్వం మంజూరు చేస్తుందని చెప్పారు.

ప్రజల దృష్టి మళ్లించేందుకే నోట్లరద్దు

స్మార్ట్ మీటర్లతో ఉచిత విద్యుత్ నిర్వీర్యం - సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

వార్త మెయిన్ పేజీలో

నాయకుల ఖాతాల్లోకి లబ్ధిదార్ల బిల్లులు

ఇల్లు నిర్మించకుంటే పట్టాలు రద్దంటూ బెదిరింపులు - తామే నిర్మిస్తామని దోపిడీ

ప్రజాశక్తి - వినుకొండ

జగనన్న కాలనీల పేరుతో రెండేళ్ల కిందట చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు ఇంకా మందగమనంగానే సాగుతున్నాయి. మొదటి దశ నిర్మాణాలే ఇంకా పూర్తవ్వలేదు. పెరిగిన ఇనుము, సిమెంటు, ఇటుకలు, కలప, కంకర ధరలతో నిర్మాణాన్ని పూర్తి చేయడం లబ్ధిదార్లకు తలకు మించిన భారంగా మారింది. ఇంటి నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.1.80 లక్షలు కేటాయించగా అవి ఏ మాత్రమూ చాలక ఇంటి నిర్మాణానికి లబ్ధిదార్లు సంశయిస్తున్నారు. మరోవైపు గృహ నిర్మాణం చేపట్టకుంటే ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థల పట్టాలు రద్దు చేస్తామని వినకొండ పట్టణంలో వాలంటరీలు, డ్వాక్రా సంఘాల ఆర్పీలు, మున్సిపాలిటీ ఉద్యోగులు, సిబ్బందితో ఒత్తిళ్ల పెంచుతున్నారు.

ఇదిలా ఉండగా తాము కాంట్రాక్టర్లను అప్పగిస్తాం ఒక్కొక్క లబ్ధిదారుడు అదనంగా రూ.70 వేలు చెల్లించాలని, డబ్బు లేని పేదలకు తామే అప్పు

▶ 2లో



వినుకొండ పరిధిలోని జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు



ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలి

ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ ర్యాలీలో పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్

ప్రజాశక్తి - నరసరావుపేట

ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ కోరారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో ఆదివారం రాత్రి స్థానిక పల్నాడు రోడ్డులోని జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం వద్ద నుండి పల్నాడు బస్టాండ్ వరకు కొవ్వొత్తులతో 'అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ దినోత్సవ' ర్యాలీని కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఏడాది మే 3వ ఆదివారం ప్రపంచ వ్యాప్తంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హెచ్ఐవి బాధితులకు మనోధైర్యం ఇచ్చేలా వైద్య సిబ్బంది కృషి చేయాలని, మనోధైర్యమే మంచి ఔషధమని చెప్పారు. ఏదో ఒక రోజు హెచ్ఐవి/ఎయిడ్స్ వ్యాధికి నివారణ మార్గం దొరుకుతుందని, బాధితులు మానసికంగా ధృడంగా ఉండాలని సూచించారు. బాధితుల పట్ల ఇతరులు వివక్ష చూపకూడదని, ఆ సందేశం కోసమే ఇలాంటి ర్యాలీలని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఎంఒ డాక్టర్ దయానిధి, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ జి.శోభారాణి, జిల్లా ఎయిడ్స్, టిబి, లెప్రసి అధికారి డాక్టర్ కె.పద్మావతి పాల్గొన్నారు.



లే అవుట్‌లో అధ్వానంగా ఉన్న రహదారి దుస్థితి

నాయకుల ఖాతాల్లోకి లబ్ధిదార్ల బిల్లులు

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పిస్తామని అధికార పార్టీ నేత ప్రకటించి మరో దోపిడీకి తెర తీశారు. కొంతమంది ప్రైవేట్ కాంట్రాక్టర్లను పురమాయించి జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణ పనులు చేపడుతున్నాడు. దీనిని అదునుగా భావించిన కాంట్రాక్టర్లు వారి సహాయకులు, సచివాలయ ఉద్యోగులు, వాలంటరీలు సైతం ఏకంగా లబ్ధిదారులను నిలువునా మోసం చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. లబ్ధిదారులతో వినుకొండ పట్టణంలోని ఐసిఐసిఐ బ్యాంకులో అకౌంట్లు ప్రారంభించి గృహ నిర్మాణ శాఖ నుండి లబ్ధిదారునికి జమయ్యే బిల్లులను నేరుగా కాంట్రాక్టర్లు డ్రా చేసుకునేలా ఏర్పాటు చేసుకున్నారు. లబ్ధిదారుని ఖాతాలో బిల్లులు జమైనట్లు మేసేజ్‌లు రావడం, నగదును మాత్రం కాంట్రాక్టర్లు డ్రా చేసుకోవడం పరిపాటైందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కేంద్ర ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి ఇచ్చే 1.80 లక్షల నాలుగు విడతలుగా జమ చేయడం జరుగుతుంది. పునాదులు వేశాక రూ.60 వేలు, స్లాబ్ లెవెల్ వరకు వచ్చాక రూ.60 వేలు, స్లాబ్ పూర్తికాగానే రూ.30 వేలు, ప్లాస్టింగ్ ఇల్లు పూర్తి కాగానే మరో రూ.30 వేలను ప్రభుత్వం జమ చేస్తుంది. దీనిలో 100 బస్తాల సిమెంటు, 480 కిలోల ఇనుముకు నగదును మినహాయించుకొని జమ చేస్తారు. ఒక్కొక్క ఇంటికి ప్రభుత్వం అందిస్తామని చెప్పిన 20 టన్నుల ఇసుక ఎటు పోతుందో అర్థం కావడం లేదు. లబ్ధిదారులకు తెలియకుండానే వారి ఖాతాలో నుండి నగదును నేరుగా కాంట్రాక్టర్లు డ్రా చేయడం, బిల్లులు రాగానే ఒక మునిసిపల్ అధికారి వాటా కింద ఒక్కొక్కరి నుండి రూ.2 వేలు అదనంగా వసూలు చేయటం పరిపాటైందనే ఆరోపణలు వస్తున్నాయి. వీటికి తోడు లబ్ధిదారులకు తెలియకుండా సిమెంటు ఇసుకను కాజేసి సచివాలయ సిబ్బంది బ్లాక్ మార్కెట్లో అమ్ముకుంటున్నారని, లబ్ధిదారుని ఇంటి స్థలంలో కనీసం గుంతలు కూడా తీయకుండా బిల్లు పెట్టి కాంట్రాక్టర్, కార్యదర్శి వాలంటీర్ కాజేస్తున్నారని, తద్వారా నిర్మాణం చాలా నాసిరకంగా ఉంటుందని లబ్ధిదార్లు వాపోతున్నారు. మరోవైపు కాలనీల్లో కనీస సదుపాయాలు కరువయ్యాయి.

చర్మకార సేవాసంఘం నియోజకవర్గ అధ్యక్షులుగా రవికుమార్

ప్రజాశక్తి - వినుకొండ



నియోజకవర్గ చర్మకార సేవ సంఘం అధ్యక్షులుగా శావల్యాపురం మాజీ జెడ్‌పిటిసి అయిన మల్లవరపు రవికుమార్ నియమితులయ్యారు. ఆంధ్రప్రదేశ్ చర్మకార సేవా సంఘం సమావేశం మంగళగిరిలో నిర్వహించగా ఆ సమావేశంలో నియామక పత్రాన్ని రవి కుమార్‌కు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుల్లా రాజారావు అందించారు.

సమగ్ర జనగణన చేయండి

టిడిపి బిసి సాధికార సమితి రౌండ్ టేబుల్ భేటి - పలు తీర్మానాలు ఆమోదం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి




మాట్లాడుతున్న అచ్చన్నాయుడు

సమగ్ర జనగణన జరగాలని, కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, జనాభా దమాషా ప్రకారం బడ్జెట్ కేటాయింపు, చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించాలని టిడిపి ఆధ్వర్యంలో జరిగిన బిసి రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. స్థానిక అరండల్‌పేటలో టిడిపి బీసీ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ సాధికార సమితి ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి, జిల్లా అధ్యక్షులు వేములకొండ శ్రీనివాస్ అధ్యక్షతన జోన్-3 అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను ఆమోదించారు.

బీసీ కార్పొరేషన్లకు దమాషా ప్రకారం నిధులు కేటాయించి స్వయం ఉపాధి కల్పించాలని, స్థానిక సంస్థల్లో కుదించిన రిజర్వేషన్లను పునరుద్ధరించి 34 శాతం రిజర్వేషన్ కల్పించాలని, ఆదరణ సహా రద్దు చేసిన 30 బీసీ పథకాలను పునరుద్ధరించాలని కోరారు. విదేశీ విద్య, స్కిల్ డెవలప్మెంట్, స్టడీ సర్కిల్స్, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ వంటి విద్యా పథకాలను పునరుద్ధరించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంలా బీసీలపై దాడుల నియంత్రణకు అట్రాసిటీ చట్టం కావాలన్నారు. చట్టసభల్లో ప్రాధాన్యం లభించని బీసీ కులాలన్నింటికీ రాజకీయ ప్రధాన్యం కల్పించాలని కోరారు. మాజీ మంత్రులు అచ్చెన్నాయుడు, యనమలరామకృష్ణుడు,ప్రత్తిపాటి పుల్లారావు హాజరయ్యారు. టిడిపి నాయకులు చదలవాడ అరవింద్ బాబు, తాతా జయప్రకాశ్, సింహాద్రి కనకాచారి, నాగుల్‌మీరా, జనసేన నాయకుడు బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీ డి రామారావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు లింగంశెట్టి ఈశ్వరరావు, బహుజన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు దొంతా సురేష్, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆలా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

ప్రజాశక్తి-తెనాలి



అనుమానాస్పద స్థితిలో యువతి మృతి చెందిన ఘటనపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం గూడవల్లికి చెందిన రమ్య(22) కొంత కాలంగా తల్లిదండ్రులకు దూరంగా ఉంటోంది. ఈవెంట్ యాంకర్‌గా విజయవాడ, హైదరాబాద్, గుంటూరు ప్రాంతాల్లో పనిచేస్తున్న రమ్య కొంత కాలంగా నందులపేట మూత బావి సెంటర్‌లో ఒంటరిగా ఉంటోంది. ఈ నేపథ్యంలో పట్టణంలోని చంద్రబాబునాయుడు కాలనీకి చెందిన యువకుడు సూర్యతేజతో ఆమెకు పరిచయం ఏర్పడింది. కొంతకాలంగా వీరిద్దరూ సహజీవనం చేస్తున్నారు. ఇటీవలి కాలంలో వీరిద్దరి మధ్య తరచుగా గొడవలు జరుగుతుండడంతో ఆమెకు సూర్యతేజ దూరంగా ఉంటున్నాడు. దీంతో మానసిక వేదనకు గురైన రమ్య శనివారం రాత్రి తల్లికి ఫోన్‌చేసి, పరిస్థితిని వివరించి, ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు చెప్పింది. తల్లి తిరిగి ఎన్నిసార్లు ఫోన్ చేసినా రమ్య స్పందించకపోవటంతో వారు తెనాలి వచ్చి చూడగా అప్పటికే రమ్య ఇంట్లోనే చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతోంది. ఆమె మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించారు. రమ్య తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. రమ్య తన తల్లికి ఫోన్ చేసిన సమయం, ఎంత సేపు మాట్లాడింది, ఏ సమయంలో మృతి చెందిందనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు.



నసరావుపేటలో రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అలెగ్జాండర్ సుధాకర్ తదితరులు

రాజీవ్‌గాంధీకి కాంగ్రెస్ ఘననివాళులు

ప్రజాశక్తి - నరసరావుపేట

అతి పిన్న వయసులో దేశ ప్రదానిగా స్వీకరించి సమర్ధవంతంగా విధులు నిర్వహించిన ఘనత రాజీవ్ గాంధీకి దక్కుతుందని డిసిసి అధ్యక్షులు అలెగ్జాండర్ సుధాకర్ అన్నారు. స్థానిక పల్నాడు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు అలెగ్జాండర్ సుధాకర్ ఆధ్వర్యంలో భారతదేశ మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1984 మాతమూర్తి ఇందిరమ్మ మరణంతో ప్రధానిగా బాధ్యతలు చేపట్టి రాజీనామా చేసే వరకు అవినీతికి తావు లేకుండా సమర్ధవంతంగా పనిచేశాడని కొనియాడారు. 40 ఏళ్ళ వయసులో ప్రధాని అయిన రాజీవ్ గాంధీ భారత ప్రధానిగా పదవి నిర్వహించినవారిలో అతి పిన్న వయస్కుడన్నారు. జాతీయ బాధ్యతను ఎంతో హుందాగా, ఓర్పుగా తన భుజాలకు ఎత్తుకున్నారని నెల రోజుల పాటు నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో 250 సభలలో అలసట లేకుండా ప్రసంగించారన్నారని ప్రజలతో ముఖాముఖి జరిపారని గుర్తు చేశారు.తన భావాలు, ఆశయాలతో భారత ఐక్యతను పరిరక్షిస్తూనే దేశాన్ని 21వ శతాబ్దంలోకి తీసుకువెళ్ళడం ముఖ్యమైనదని రాజీవ్ పదేపదే చెబుతూండేవారన్నారు. రాజీవ్ వర్ధంతి జాతీయ తీవ్రవాద వ్యతిరేక దినోత్సవంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎస్ఎం బాష, సీదా కృష్ణ ,రవి కిషోర్, రమేష్, పి రమేష్, కొండలు, బుల్లి,ప్రేమ్, దేవానంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

తన సంస్కరణలతో భారతదేశాన్ని ప్రపంచదేశాల సరసన నిలిపిన ఘనత రాజీవ్ గాంధీ అని, దేశంలో శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి బీజం వేసిన పాలనాదక్షుడు రాజీవ్ అని పొన్నూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జక్కా శ్రీనివాస్ అన్నారు. పొన్నూరు పట్టణంలోని రాజీవ్ చౌక్ నందలి రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు జక్కా శ్రీనివాస్ రాజీవ్ గాంధీ సేవలను కొనియాడారు.

ఉర్దూ యూనివర్శిటీ శాఖ ఏర్పాటు అభినందనీయం

ప్రజాశక్తి - విజయవాడ ఎడ్యుకేషన్

గుంటూరులో డాక్టర్ అబ్దుల్ హఖ్ ఉర్దూ యూనివర్శిటీ శాఖను ఏర్పాటుచేయడం అభినందనీయమని ఆలిండియా మిల్లీ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి షేక్ మునీర్ అహ్మద్ అన్నారు. యూనివర్శిటీశాఖ ఏర్పాటుచేసేందుకు కృషి చేసిన మైనారిటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఏ.ఎం.డి. ఇంతియాజ్ అహ్మద్‌కు మిల్లి కౌన్సిల్ సభ్యులు ఆదివారం జరిగిన కార్యక్రమంలో అభినందించారు. ఈసందర్భంగా షేక్ మునీర్ అహ్మద్ మాట్లాడుతూ గుంటూరు పరిసర ప్రాంత వాసుల చిరకాల కోరికపై సానుకూలంగా స్పందించి గుంటూరు నగరంలో యూనివర్శిటీ శాఖ ఏర్పాటు, భవన నిర్మాణానికి అనుమతి లభించిందన్నారు. అలాగే డాక్టర్ అభ్దుల్ హఖ్ ఉర్దూ యూనివర్శిటీ మౌళిక సదుపాయాలు కల్పించడం కోసం రు. 51.40 కోట్లు ముఖ్యమంత్రి మంజూరుచేశారని అన్నారు. వీటితో పాటు 175 మదరసాలలో మోడ్రన్ ఎడ్యుకేషన్ బోధించేందుకు టీచర్ల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. ఇప్పటికే ఉర్దూ రెండో అధికార భాషగా ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాయలంలో ఎం.ఎ. ఉర్దూ తరగతులన నిర్వహించనుందన్నారు. రానున్న రోజుల్లో ఎం.ఎ. అరబిక్ కొరకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉర్దూ పాఠశాలల్లో టీచర్ల నియామకానికి కూడా రు. 17 కోట్లు మంజూరుచేశారన్నారు. ఉర్దూ విద్యా సంస్థల అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహణరెడ్డికి, ఉప ముఖ్యమంత్రికి అంజద్ భాషాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో మజ్లిసుల్ ఉలేమా ప్రతినిధులు ముఫ్తి అబ్దుల్ బాసిత్, ముఫ్తి యూసుఫ్, ముఫ్తి హబీబ్ మౌలానా, డాక్టర్ ఇషాక్, మౌలానా ఫారూఖ్ సిద్దిఖ్, కృష్ణా జిల్లా ఐఎంఎ ప్రెసిడెంట్ డాక్టర్ రె హమాన్, ముస్లిం అడ్వకేట్ అసోసియేషన్ కార్యదర్శి అబ్దుల్ మతీన్, ట్రెజరర్ మహ్మద్ ఖలీలుల్లా, టైర్ అసోసియేషన్ అధ్యక్షులు బాబావలి, షఫీ అహ్మద్ పలువురు పాల్గొన్నారు.

నోకియా 4జీ ఫీచర్ ఫోన్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

వినియోగదారులకు ఎప్పటికపుడు కొత్త తరం ఫోన్లను అందించడంలో ముందున్న నోకియా సరికొత్తగా 106 నూతన 4జీ ఫీచర్‌తో విడుదల చేసినట్లు సంస్థ మార్కెటింగ్ ప్రతినిధి సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. నోకియా 105 మార్కెట్ లీడింగ్ ఫీచర్ ఫోన్ ఫోర్ట్‌పోలియోకు నూతన జోడింపులను ప్రకటించినట్లు తెలిపారు. ఈఫోన్‌లు యుపీఐ 123 పే ఫంక్షనాలిటీతో వస్తాయన్నారు. యూపీఐ సౌలభ్యం, డిజిటల్ లావాదేవీలను సురక్షితంగా, సజావుగా నిర్వహించుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు.

ముగిసిన పవర్‌లిఫ్టింగ్ అండ్ బెంచ్‌ప్రెస్ ఛాంపియన్‌షిప్ పోటీలు

ప్రజాశక్తి-తెనాలి

పట్టణానికి చెందిన క్విక్ ఫిట్‌నెస్ ఏరేనా, పవర్ లిఫ్టింగ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన 10వ రాష్ట్ర సబ్ జూనియర్స్, జూనియర్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ అండ్ బెంచ్ ప్రెస్ ఛాంపియన్ షిప్‌పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. విజేతలకు బహుమతి ప్రధానోత్సవంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. స్థానిక జెట్టి అమ్మయ్య నాగభూషణం సదన్‌లో జరిగిన పోటీల విజేతల వివరాలను అంతర్జాతీయ వెయిట్ లిఫ్టర్, క్విక్ ఫిట్‌నెస్ ఎరేనా నిర్వాహకులు ఘట్టనమనేని సాయిరేవతి వెల్లడించారు. సబ్ జూనియర్స్‌లో బాలురు 53 కేజీల విభాగంలో వి.వీరబాబు, సి.రాకేష్, ఎ.జగదీష్ వరుసగా ప్రధమ ద్వితీయ, తృతీయ స్థానాలను పొందారు. అలాగే 59 కేజీల విభాగంలో పి.వనయ్‌కుమార్, జి.హేమవర్ధన్, కె.శివాజి, 66 కేజీల విభాగంలో ఎన్.హర్షబాలనితీష్, ఎస్.కిషోర్, ఎస్.గగన్‌కుమార్, 74 కేజీల విభాగంలో కె.రవితేజ, ఎస్.బాలసాయిచరణ్, వి.బాలకృష్ణ, 83 కేజీల విభాగంలో షేక్ అబ్దుల్‌మార్టిన్, కె.గుణశేఖర్, జి.సురేష్, 93 కేజీల విభాగంలో కె.కుష్వంత్, ఎస్.మహేష్‌బాబు, కె.రోహిత్ వర్మ, 105 కేజీల విభాగంలో డి. చైతన్యకుమార్, ఏవివి వెంటకసత్యనారాయణ, టి.శ్రీభవానిశంకరరావు, 120 కేజీల విభాగంలో ఎం.వెంకటసాయితనయ, డి.వేణుసాగర్, బి.మల్లెమ్‌కొండయ్య వరుసగా ప్రధమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. జూనియర్స్ విభాగంలో 83 కేజీల విభాగంలో ఎ.సతీష్, షేక్ ఇబ్రహీం, షేక్ అష్రాప్ ఆలి, 93 కేజీల విభాగంలో ఎం.వీరేంద్ర, జివివి సత్యనారాయణ, ఎంకె లలితేశ్వరరావు, 105 కేజీ విభాగంలో జి.రోహిత్‌కుమార్, కె.బాబి. డి.వేణుమణికంఠ, 120 కేజీల విభాగంలో ఎల్ శివనాగేశ్వరరావు, జి.గౌతమ్, ఎస్.సాయిభవాని వరుసగా ప్రధమ, ద్వితీయ, తృతీయ స్థానాలను పొందారు. అలాగే బెంచ్ ప్రెస్‌లో జూనియర్స్‌లో ఎం.జగన్, సిహెచ్ లోకేష్, ఎం.వీరేంద్ర, సబ్ జూనియర్స్‌లో ఎన్.హర్షబాలనితీష్, షేక్ అబ్దుల్ మార్టిన్, జె.రవితేజ వరుసగా ప్రధమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలను ఎమ్మెల్యే అభినందించి, బహుమతులను అందించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు, కోచ్‌లు, నిర్వాహక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

మూత్రపిండాల సమస్యపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-గుంటూరు

మూత్రపిండాల సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ సునీల్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో జరిగిన ఆరోగ్యసభలో ఆయన పాల్గొని మూత్రపిండం, మూత్రాశయం, ప్రోస్టేట్ గ్రంధికి సంబంధించిన సమస్యల గురించి, వాటి నివారణ గురించి, తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. కిడ్నీలు చిక్కుడు గింజ ఆకారములో 10 నుండి 12 సెంటీమీటర్ల పరిమాణంలో, వెన్నుపూసకు ఇరువైపులా ఉంటాయని, ఇవి నిరంతరం మన శరీరంలో రక్తాన్ని శుద్ధిచేసి అన్ని అవయవాలకూ రక్తాన్ని సరఫరా చేస్తాయని చెప్పారు. మనిషి అవసరానికి ఒక మూత్ర పిండం సరిపోతుందని, ఒకటి చెడిపోయినా మనకు లక్షణా లు కనిపించవని కావన అప్రమత్తంగా ఉండాలన్నారు. మూత్రపిండాలు సరిగా పనిచేయకుంటే రక్తం శుద్ధి అవ్వదని తెలిపారు. మనం తీసుకునే ఆహారంలో ఉప్పు తగ్గించాలని అలాగని అసలు ఉప్పు తినకుండా మానరాదని సూచించారు. పాముకాటు, విషం తాగిన కేసుల్లో కొన్ని సందర్భాల్లో మూత్రపిండాలు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. అటువంటి సందర్భంలో నెఫ్రాలజిస్ట్‌ను సంప్రదించాలన్నారు. జన్యుపరంగా గానీ, జీవనశైలి మూలంగా గానీ కిడ్నీలలో రాళుఏర్పడతాయని,అవి 5 మిల్లీ మీటర్లలోపు ఉంటే మూత్రంలో పడిపోతాయని, 10 మిల్లీ మీటర్ల పైన ఉంటే అధికశాతం శస్త్రచికిత్స చేయాలని తెలిపారు. 5 నుంచి 10 యం.యం.మద్య పరిమాణంలో ఉన్న రాళ్ల విషయంలో కొన్ని సందర్భాల్లో మందులతో, ఒక్కోసారి శస్త్రచికిత్స చేయాల్సి వస్తుందన్నారు. రోజుకు 4 నుండి 5 లీటర్ల నీరు తాగితే మంచిదన్నారు. శ్రమించి పనిచేసే వారు ఎక్కువ నీరు తీసుకోవచ్చున్నారు. ప్రాస్టిక్స్ గ్రంధి గ్రంధి 25 జిఎం నుండి 30 జిఎం వరకూ ఉంటే ఇబ్బంది లేదని, కానీ దాని బరువు, పరిమాణం దాని పరిమాణం పెరిగిన కొద్దీ ఒక్కొక్కసారి మూత్రనాళంపై వత్తిడి పడినొక్కుకుపోయి, మూత్రం పూర్తిగా రాకుండా సన్నగా ధారగా రావడం, మరలా మరలా మూత్రవిసర్జనకు వెళ్లాలని అనిపిస్తుందని వివరించారు. అని తెలిపారు. ఎర్రరక్త కణాలు యముకలలో తయారైనప్పటికి, అలా తయరవడానికి ఉత్ప్రేరకం మూత్రపిండంలో ఉంటుందని, కావున కిడ్నీ దెబ్బతింటే ఎర్రరక్త కణాల ఉత్పత్తి తగ్గి రక్తహీనత వస్తుందన్నారు.అనంతరం డాక్టర్ సునీల్‌కుమార్ దంపతులను అవగాహన సభ్యులు సన్మానించారు.


మాట్లాడుతున్న డాక్టర్ సునీల్‌కుమార్

మొక్కజొన్న వ్యర్థాలు కలియదున్నండి

వేసవి దుక్కులకు ఇదే అదును : ఎఒ

ప్రజాశక్తి - నరసరావుపేట

మొక్కజొన్న నూర్పిడి అనంతరం మిగిలి ఉన్న పంట వ్యర్ధాలను తగులబెట్టకుండా భూమిలో కలియ దున్నడం వలన సూక్ష్మ ఎరువులను వద్ధి చేసుకునే అవకాశం ఉంటుందని భూమిలో సూక్ష్మ పోషకాలను పెంపొందించడం ద్వారా ఆరోగ్య కరమైన ఉత్పత్తులు సాధనకు అవకాశాలు ఉంటాయని మండల వ్యవసాయ శాఖ అధికారి వి.నరేంద్రబాబు అన్నారు. ఈ మేరకు ఆయన ప్రజాశక్తితో పలు విషయాలు తెలిపారు.


వి.నరేంద్ర బాబు, ఎఒ

ఇటీవల నూర్పిడి అనంతరం మొక్కజొన్న వ్యర్ధాలను రైతులు తగుల బెడుతున్నారని, దీనివలన భూ వాతావరణం కాలుష్యం, చుట్టుపక్కల పంట పొలాల్లో సాగవుతున్న పంటలకు నష్టం, మూగజీవాలు ప్రమాద బారిన పడే సంఘటనలు చోటు చేసుకుంటాయన్నారు. ఇటీవల నాదెండ్ల మండలం సాతులూరు గ్రామానికి చెందిన రైతు బండారుపల్లి వెంకటేశ్వర్లు (70) నూర్పిడి అనంతరం మొక్కజొన్న వ్యర్ధాలను తగులబెడుతూ ఆ మంటల్లో చిక్కుకొని మత్యువాత పడ్డారన్నారని గుర్తు చేశారు. ఆయా వ్యర్ధాలను కలియ దున్నడం వలన ఆయా వ్యర్థాలు భూమిలో కలిసి కుళ్ళి సూక్ష్మ ఎరువులుగా వద్ధి చెందుతాయని చెప్పారు.

వేసవి దుక్కులతో బహుళ ప్రయోజనాలు

నిత్యం సాగులో నిమగ్నమయ్యే రైతులు మంచి దిగుబడులు సాధించడానికి వేలకు వేలు ఖర్చు చేసి రకరకాల మందులు వాడడంతో పాటు పంట చేతికి వచ్చేదాకా పైరును కంటికి రెప్పలా చూసుకుంటాడు. అయితే చిన్న చిన్న యాజమాన్య పద్దతులు పాటించడంతో ఖర్చును కూడా తగ్గించుకోవచ్చున్నారు. ఖరీఫ్ సాగు దుక్కులు లోతుగా దున్నడం వలన బహుళ ప్రయోజనాలు పొందుతారని, భూసారం పెరుగదలతో పాటు, పురుగులు, తెగుళ్ల నివారణకు ఉపయోగపడతాయన్నారు. దీని వలన తేమ శాతం పెరుగుతుంది. భూమి లోపల ఉంటూ పంటలు నష్టం కలిగించే వివిధ రకాల ప్యూమాలను వేసవి దుక్కులతో నివారించవచ్చు.

నెల లోపల గట్టి పొరలను పగలగొట్టడం ద్వారా మొక్కల వేరు వ్యవస్థ బాగా లోపలికి చొచ్చుకుపోవడానికి వీలు ఏర్పడుతుంది. మొక్కలు ఎదుగుదలకు కావలసినంత తేమ సూక్ష్మ పోషకాలు మొక్కలకు అందడం ద్వారా నాణ్యమైన దిగుబడులు వస్తాయి. తొలకరి వర్షాలకు నీరు నేలలోనికి బాగా ఇంకి భూగర్భ నీటిమట్టం పెరుగుతుంది. నేల తేమగా ఉండటం వలన పంటల మొలక శాతం అధికంగా ఉంటుంది. మొండి జాతి కలుపు మొక్కల ఆకులు రాలి ఎండిపోవడంతో పాటు నేలల్లో కలిసి సేంద్రియ ఎరువుగా మారి భూసారం పెరుగుతుందని తెలిపారు.


దుక్కి దున్నుతున్న రైతు

రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులకు గాయాలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న సంఘటనలో తండ్రి కొడుకు తీవ్రంగా గాయపడ్డారు. సత్తెనపల్లి మండలం వెన్నాదేవి సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో మేడికొండూరు మండలం కొర్రపాడు గ్రామానికి చెందిన చింతపల్లి సురేష్ అతని కుమారుడు బాలుడు శేషగిరి రావు తీవ్రంగా గాయపడ్డారు. ధూళిపాళ్ల వైపు నుండి కొర్రపాడు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని సత్తెనపల్లి నుండి పిడుగురాళ్ల వైపు వెళుతున్న కారు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. తీవ్రంగా గాయపడ్డిన క్షతగాత్రులను సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాటిచెట్టు పై నుండి పడి యువకుడు మృతి

ప్రజాశక్తి - వినుకొండ

తాటి చెట్టు పై నుండి పడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన బోల్లపల్లి మండలం దోమలగుండం గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన పోలేపల్లి ఏసుబాబు (25) యువకుడు తాటి ముంజలకై కాయలు కోసేందుకు గ్రామ శివారులోని తాటి చెట్టు ఎక్కి కాయలు తీస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడటంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు బండ్లమోటు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మృతుడు ఏసుబాబు (ఫైల్ ఫోటో)

ఏలియన్‌పేట భూ సమస్యపై విచారణకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి - నరసరావుపేట

పులిచింతల ప్రాజెక్ట్ నిర్మాణ సందర్భంగా 2008లో భూములు కోల్పోయిన దాచేపల్లి మండలం ఏలియన్‌పేట నివాసితుల భూ సమస్యలపై పల్నాడు కలెక్టర్ స్పందించారు. నిర్వాసితులు ప్రస్తుతం ఉంటున్న ప్రాంతంలో దేవాదాయ భూమి ఉందనే వివాదంపై విచారణ కోసం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్‌ను విచారణాధికారిగా నియమించారు. విచారణ సమయంలో ఇరు పక్షాలూ ఘర్షణకు తావివ్వకుండా సమస్య పరిష్కారానికి సహకరించేలా చూసుకోవాలని చెప్పారు.


మాదినేని ఆంజనేయులుతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు

టిడిపి వినుకొండ మండల అధ్యక్షులుగా మాదినేని ఆంజనేయులు

ప్రజాశక్తి - వినుకొండ

టిడిపి వినుకొండ మండలం అధ్యక్షులుగా మార్కెట్ యార్డ్ చైర్మన్ మాదినేని ఆంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు స్థానిక టిడిపి కార్యాలంలో ఆదివారం సమావేశంలో ఆయన్ను ఎన్నుకున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన టిడిపి జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ టిడిపి అభ్యున్నతికి అంకితభావంతో పనిచేయడం వల్ల ఆయన్ను ఎన్నుకున్నట్లు చెప్పారు. పార్టీ కోసం పాటుపడే ప్రతి కార్యకర్తకూ ప్రత్యేక స్థానం ఉంటుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం పట్ల పార్టీ శ్రేణులు అంకితభావంతో పనిచేయాలని, రాష్ట్రంలో సాగుతున్న ప్రజా వ్యతిరేక పాలన గురించి ఇంటింటికీ ప్రచారం చేయాలని చెప్పారు. మాదినేని ఆంజనేయులు మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించి వినుకొండ మండలంలో టిడిపి అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు.

టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నీ విజేతగా ముప్పాళ్ల ఫ్రెండ్ సిసి

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని ఆరేపల్లి ముప్పాళ్లలో ముప్పాళ్ల ప్రీమియర్ లీగ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. పోటీల్లో మొత్తం 25 క్రికెట్ జట్లు పాల్గొనగా విజేతగా ముప్పాళ్ల ఫ్రెండ్ సిసి క్రికెట్ జట్టు నిలిచింది. ఆరేపల్లి వైపర్ క్రికెట్ జట్టు ద్వితీయ స్థానం, అంగలూరు క్రికెట్ జట్టు తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. విజేతలకు అఖిల్ ఓవర్సీస్ ఎమ్‌డి నలబోతు అఖిల్ బహుతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు జె.ప్రసన్న, వై.శ్రీకాంత్, పి.ప్రసన్న, కె.బాజీ పాల్గొన్నారు.


ముప్పాళ్ల ఫ్రెండ్ సిసి జట్టుకు ట్రోఫీ, నగదు బహుమతి అందజేస్తున్న నలబోతు అఖిల్

విత్తు దశలోనే దగా..

- డిమాండ్ పేరుతో బ్లాక్ చేసి అధిక ధరలకు మిర్చి విత్తన విక్రయాలు
- కిలో విత్తనాలు రూ.2 లక్షలుపైనే!
- రైతుల నుండి ముందస్తుగానే నగదు వసూలు చేస్తున్న వ్యాపారులు


ప్రజాశక్తి - పెదకూరపాడు


రైతుల పరిస్థితి అమ్మబోతే అడవి కొనబోతే కొరివిగా తయారైంది. రానున్న వ్యవసాయ సీజన్‌లో సాగుకు మిర్చి విత్తనాల కొనుగోలును రైతులు ఇప్పుడే ప్రారంభించారు. గత నాలుగేళ్ల అనుభవాలను పరిశీలిస్తే రైతులకు కాస్తో కూస్తో అనుకూలించింది. గత సీజనే. పెట్టుబడి పెరిగినా ధరలు కొంత అనుకూలంగా, అదీ స్థిరంగా ఉండడం రైతులకు కాస్తంత ఉపకరించింది. దీంతో ఈ ఏడాది మరింతమంది రైతులు మిర్చి సాగుపై ఆశలు పెట్టుకుంటున్నారు. పెదకూరపాడు మండలంలో మిర్చి సాగు సగటున 8 వేల ఎకరాలు ఉండగా రానున్న సీజన్‌లో పెరిగే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది.

మరోవైపు విత్తన రూపంలో రైతులను దోపిడీ చేయడానికి మార్కెట్ శక్తులు ఎత్తులు వేస్తున్నాయి. విత్తనాల ధరలు పెరుగుతున్నాయంటూ విత్తన వ్యాపారులు, కంపెనీల ప్రతినిధులు ముందస్తు ప్రచారం మొదలుపెట్టారు. దీంతో ధరలు కాస్తంత తక్కువగా ఉన్న ఇప్పుడే విత్తనాలు కొనేద్దామని రైతులు తొందర పడుతున్నారు. ఈ క్రమంలో అడ్వాన్స్ బుకింగ్ పేరుతో వ్యాపారులు వసూళ్లను మొదలుపెట్టారు. డిమాండ్ ఎక్కువగా ఉందని ప్యాకెట్లు తగ్గించి ఇవ్వటం తంతుగా మారింది. క్రోసూరు మండలంలో పది ప్యాకెట్లకు ముందస్తుగా రైతుల నుండి డబ్బులు వసూలు చేశారు. ప్యాకెట్ల పంపిణీ అప్పుడు ఆరు ప్యాకెట్లు మాత్రమే ఇచ్చారు.

ఎంఆర్‌పికి మించి..

వ్యాపారులు డిమాండ్ పేరుతో కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు అమ్ముతున్నారు. స్టాకు లేదని.. త్వరలో వస్తుందని ముందుగానే ఎక్కువ డబ్బులు తీసుకుంటున్నారు. సాధారణంగా వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చిన తర్వాతే వ్యాపారులకు విత్తనాలు సరఫరా చేయాలనే నిబంధనలూ ఇక్కడ అమలు కావడం లేదు. వ్యవసాయాధికారులూ పెద్దగా పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. వైరస్‌ను తట్టుకొని నిలబడే మిరప విత్తనాలకు మార్కెట్లో మూడేళ్ల నుండి డిమాండ్ ఉంది. గతేడాది నుంచి పూతలో పురుగు తట్టుకునే రకాలు మార్కెట్లోకి వచ్చాయని వ్యాపార వర్గాలు ప్రచారం చేయడం ప్రారంభించారు. అప్పటివరకు 10 గ్రాముల ప్యాకెట్ ధర 200-300 మాత్రమే ఉండేది. రకరకాల పేర్లతో ప్యాకెట్ ధర గతేడాది 600-900 వరకు పెంచారు. ప్రస్తుతం ఎంఆర్‌పి రూ.1360 ఉండగా రూ.2500 వరకూ విక్రయిస్తున్నారు. ఇదే మాదిరి ఐదారు కంపెనీల విత్తనాలకు గిరాకీ సృష్టించి రైతులను నుండి అధిక ధర రూపంలో దండుకుంటున్నారు.





బ్లాక్‌లో అధిక ధరకు విక్రయిస్తున్న పత్తివిత్తనం ప్యాకెట్

ఆర్‌బికేల ద్వారా విత్తనాలు సరఫరా చేయాలి

టి.హనుమంతరావు, కౌలురైతు సంఘం నాయకులు.



బ్లాక్ మార్కెట్‌లో విత్తనాలు అమ్మడం వల్ల రైతులపై ఆర్థిక భారం పడుతోంది. దీనికి అవకాశం లేకుండా ఆర్‌బికేల ద్వారా విత్తనాలను సరఫరా చేయాలి. ఇందుకుగాను మిర్చి విత్తనాలను మొత్తం ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

శాంతి, మండల వ్యవసాయాధికారి, పెదకూరపాడు



రైతులకు అందించేందుకు మిర్చి విత్తనాల కోసం ఉన్నతాధికారులకు ఇప్పటికే ప్రతిపాదించాం. అవి వచ్చిన వెంటనే రైతు భరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేస్తాం. దుకాణాల్లో ఎంఆర్‌పికి మించి విత్తనాలు విక్రయిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.

నేటి నుండి ప్రభుత్వ ఉద్యోగుల ఉద్యమ కార్యాచరణ

ప్రజాశక్తి - నరసరావుపేట


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని పలుమార్లు కోరినా, అనేక ఉద్యమాలు చేసినా ప్రభుత్వం స్పందించని నేపథ్యంలో ఉద్యమ కార్యాచరణకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు ఎస్. చినరామిరెడ్డి తెలిపారు. ఈ మేరకు వాల్‌పోస్టర్‌ను సంఘ కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ సిపిఎస్ రద్దు, 1వ తేదీనే జీతభత్యాలు, 1993కు ముందు నియమితులైన ఎన్ఎంఆర్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులైజేషన్, 11వ పిఆర్‌సి అమలు, బకాయిలు తక్షణమే విడుదల, ఉద్యోగుల జిపిఎఫ్ మొత్తాలకు భద్రత, ఉద్యోగుల సమస్య పరిష్కారానికి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం తదితర డిమాండ్లపై ఉద్యమిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా నరసరావుపేట కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం నిరాహార దీక్ష ఉంటుందని, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. 23న చిలకలూరిపేట, 26న బెల్లంకొండ, 27న వినుకొండ, 29న సత్తెనపల్లి, 30న పిడుగురాళ్ల, 31న మాచర్ల తహశీల్దార్ కార్యాలయాల వద్ద రీలే దీక్షలు ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి ఎన్.రవి, ఉపాధ్యక్షులు ఎస్.ఎం నాయక్, బి.సంపూర్ణ, రామకృష్ణ సాయి, జాయింట్ సెక్రటరీ టి.వై. ప్రభాకర్ పాల్గొన్నారు.

నేడు నరసరావుపేట కలెక్టరేట్ ఎదుట రిలేదీక్షలు - పోస్టర్‌ను ఆవిష్కరించిన సంఘం నాయకులు

అలరించిన నృత్య ప్రదర్శనలు

రైతు వీరగంధం రత్తయ్య, నటులు కోటి యాదవ్‌కు సత్కారం

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని జాషువా కళా ప్రాంగణంలో జరుగుతున్న కళాసాగరి ట్రస్ట్ నాట్య ఉత్సవాలు ఆదివారం రెండోరోజుకు చేరుకున్నాయి. ఉదయం నుండి సాయంత్రం వరకు నిర్విరామంగా సాగిన నృత్య పోటీల్లో గుంటూరు, ఒంగోలు, నరసరావుపేట, కందుకూరు, వినుకొండ, తదితర ప్రాంతాలకు చెందిన 60 మంది బాలలు ప్రదర్శించిన నత్యాలు ప్రేక్షకులను ఆకర్శించాయి. గణేష్ రత్తయ్య స్మారక ఆదర్శ రైతు సత్కారాన్ని ఉమ్మడివరానికి చెందిన రైతు వీరగంధం రత్తయ్యకు అందించారు. వెండితెర, బుల్లితెర వర్ధమాన నటుడు కోటి యాదవ్, చిలకలూరిపేటకు చెందిన విద్యాసంస్థల అధినేత ఈదర గిరీష్‌బాబు, కళాసాగరి ట్రస్ట్ కార్యనిర్వహక సభ్యులందరూ కలసి రత్తయ్యను సత్కరించారు. మధ్యతరగతి రైతు కుటుంబాల అభ్యున్నతి కోసం కృషిచేసిన ఒక ఆదర్శవాదిని స్మరించుకుంటూ ఒక రైతును సత్కరించడం మంచి సంప్రదాయమని వక్తలు కొనియాడారు. అనంతరం జరిగిన డాన్స్ పోటీల బహుమతి ప్రదానోత్సవ సభలో నటులు కోటి యాదవ్‌ను ట్రస్ట్ సభ్యులు సత్కరించారు. కార్యక్రమాల్లో సాతులూరు నటరత్న ఎన్టీఆర్ కళాపరిషత్ కార్యదర్శి ఎన్.వెంకటేశ్వరరావు, వినుకొండ మున్సిపాల్టీ మాజీ చైర్మన్ ఎం.నరసింహారావు, గంగినేని ఫౌండేషన్ అధినేత రాఘవ, ఉమ్మడివరం సర్పంచ్ ఆనంద్, కళాసాగరి ట్రస్ట్ కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు, సదాశివరావు, బ్యాంకు నాగేశ్వరరావు, ఎం.గిరిబాబు, బి.శ్రీనివాసరావు, వై.ఆదిరాములు, జయచంద్ర పాల్, కోటి, చలపతి రావు, జ్యోతి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న అతిథులు, నిర్వాహకులు

మహిళా రెజ్లర్ల పోరాటానికి సంఘీభావం

ప్రజాశక్తి-గుంటూరు

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన రెజ్లర్ల ఫెడరేషన్ అధ్యక్షుడు, బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఢిల్లీలోని రెజ్లర్లు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా ఆదివారం స్థానిక 41వ వార్డు, పుచ్చలపల్లి సుందరయ్య నగర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సిఐటియు నగర ఉపాధ్యక్షుడు షేక్.మస్తాన్‌వలి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐద్వా నగర అధ్యక్షులు జి.రమణ మాట్లాడుతూ అంతర్జాతీయ అవార్డులు సాధించి, దేశ కీర్తి ప్రతిష్టలు ఇనుమడింప చేసిన రెజ్లర్లు గత నెలరోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రధానిగానీ, కనీసం బిజెపి మహిళా మంత్రులు గానీ నోరు మెదకపోవటం చాలా దుర్మార్గం అన్నారు. సిపిఎం పార్టీ నగర కమిటీ సభ్యులు షేక్ ఖాశింషహీద్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు జోక్యంతో బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్‌పై పోలీసులు కేసు నమోదు చేసి చేతులు దులిపేసుకున్నారని, ఇప్పటివరకు



41వ వార్డు పుచ్చలపల్లి సుందరయ్య నగర్‌లో నిరసన తెలుపుతున్న రమణ, మస్తాన్‌వలి తదితరులు

అరెస్టు చేయలేదు అన్నారు.కార్యక్రమంలో మహిళా సంఘం సుందరయ్య నగర్ అధ్యక్షులు షేక్ ఖాజాబి, సభ్యులు కె.నాగమల్లేశ్వరి, నాయుడు పద్మ, ఆదిలక్ష్మీ, అచ్యుత కుమారి, సిఐటియు నాయకులు గోనె లూథర్‌పాల్, సీపాన పద్మనాభుడు, పాగళ్ళ అశోక్, యం.డి ముస్తాక్ పాల్గొన్నారు.

ప్రాచీన చిత్రకళల్లో రాణిస్తున్న నవ్య

- సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా బిజీగా ఉన్నా తీరిక సమయం చిత్రకళకే

- ఎంతో మంది విద్యార్థులకూ చిత్రకళల్లో శిక్షణ

ప్రజాశక్తి-తెనాలి:

సాఫ్ట్‌వేర్ ... ఈ రంగంలో ఉండే వారికి క్షణం తీరిక ఉండదు. నిత్యం బిజిగా ఉంటారు. దానికి తగినట్టే ఆయా సంస్థలు ప్రోత్సాహకాలు కూడా ఉంటాయి. ఈ నేపధ్యంలో వారమంతా బిజీగా ఉండే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు వారాంతంలో వచ్చిన శలవులో పూర్తిస్థాయిలో సేదతీరేందుకు ముందుగానే ప్రణాళిక సిద్దం చేసుకుంటారు. అయితే ఆ పోకడలకు భిన్నంగా అమెరికన్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా పనిచేస్తున్న ఓ యువతి అంతరించిన పోతున్న ప్రాచీన చిత్రకళలను నేర్చుకుని, దానిలో విద్యార్థులను నిష్టాతులుగా తయారు చేసేందుకు కృషి చేస్తున్నారు. తెనాలి పట్టణానికి చెందిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత వేజళ్ళ ఉమామహేశ్వర్, ఉపాధ్యాయిని ఝాన్సిలక్ష్మి దంపతుల కుమార్తె వేజళ్ళ నవ్య ప్రదర్శిస్తున్న చిత్రకళా నైపుణ్యం వివరాలిలా ఉన్నాయి.

భారతదేశంలో చిత్రకళలు అనేకం ఉన్నాయి. అవి మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింభాలుగా ఉన్నాయి. విభిన్న మతాలు, విభిన్న కులాలు, ఆచార వ్యవహారాలను చిత్రకళల్లో చూసిన సందర్భాలు అనేకం. ప్రాంతాల వారీగా వారి వారి జీవనశైలిని ప్రతిభింభించే చిత్రకళలో ప్రధానంగా కలంకారి, వర్లి, మండల, మధుబని, గోండ్ కళలు ప్రాచుర్యం పొందాయి. ఆయా చిత్రకళలను ఎంతో ఆసక్తితో నేర్చుకున్న వేజళ్ళ నవ్య మరికొంత మంది ఆసక్తిగల విద్యార్థులను తీర్చిదిద్దుతోంది. ప్రస్తుతం నవ్య ఇంజనీరింగ్ పూర్తి చేసి, అమెరికాకు చెందిన సాఫ్ట్‌వేర్ కంపెని పియర్సన్‌లో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా పనిచేస్తోంది. ఏమాత్రం కాళీ దొరికినా తన సమయాన్ని చిత్రకళకే కేటియిస్తోంది. తండ్రి ఉమామహేశ్వర్ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న సమయంలో న్యూఢిల్లీ, ఉదయపూర్‌కు చెందిన సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ ట్రెయినింగ్ లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై శిక్షణ పొందారు. సంస్కృతి సంప్రదాయాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించేవారు. తండ్రిని స్ఫూర్తిగా తీసుకున్న నవ్య బాల్యం నుంచి పండుగలు, వాటి విశిష్టతలను తెలుసుకుంటూ, వాటి ఆచార వ్యవహారాల్లో ముందుండేవారు. ఇప్పుడు ఓ వైపు సాఫ్ట్‌వేర్ రంగంలో, మరోవైపు చిత్రకళల్లో రాణిస్తున్నారు.



అమెరికన్ ఆర్ట్ జంటాంగిల్‌లో నవ్య చిత్రం

ప్రాచీన చిత్రకళలు... వాటి నేపథ్యం..

చిత్రకళల్లో వర్లి అనేది గిరిజనులకు చెందిన చిత్రకళ. ఈ కళ మహారాష్ట్ర ప్రాంతంలో ప్రధానంగా కనిపిస్తుంది. పదో దశాబ్దంలో ప్రాచుర్యం పొందిన కళగా చరిత్ర చెబుతోంది. గిరిజనుల్లో వివాహాలు, జనన, మరణ సందర్భాలకు చెందిన చిత్రాలను గోడలపై చిత్రీకరించేవారు. రెండోది మండల చిత్రకళ . ఇది ఆధ్యాత్మిక, ఆచార వ్యవహారాలకు ప్రతిబింభం. బుద్ధిజం, హిందూయిజంలో ప్రాచుర్యం పొందింది. ఈ చిత్రకళ వృత్తాకారంపై ఆధారపడి ఉంటుంది. వాస్తవానికి ఇది మెడిటేషన్, ఏకాగ్రతను పెంపొందిస్తుంది మూడవదిగా పురాతనమైన మధుబని చిత్రకళ. ఈ కళ పురాతన నగరమైన మిథిలాలో అభివృద్ధి చెందింది. దీనిలో దేవతలు, సూర్యుడు, చంద్రుడు, వృక్షాలు, జంతువులతో కూడిన చిత్రాలుంటాయి. ఇప్పుడు ఈ చిత్రాలు చీరలపై, వివిధ రకాల వస్త్రాలపై ముద్రితమౌతున్నాయి. నాల్గవది గోండ్ పెయింటింగ్. ఇది జానపద చిత్రకళ. మద్య భారతదేశంలో గోండులు అనే గిరిజన జాతికి చెందిన కళ. ఈ చిత్రకళలో ఉపయోగించే రంగులు సహజసిద్ధంగా తయారు చేసుకుంటారు. ప్రాచీన చిత్రకళలకు తోడు ఆధునిక చిత్రకళల్లోనూ నవ్య రాణిస్తోంది. వీటిలో అమెరికన్ చిత్రకళలు జెంటాంగిల్, డూడుల్ ప్రాచుర్యం పొందాయి. ముఖ్యంగా డూడుల్ చిత్రకళలో హాస్యరసం కనిపిస్తుంది.


నవ్య చిత్రించిన వర్లి చిత్రకళ చిత్రం

కళలు మానసిక వికాసానికి దోహదం చేస్తాయి

వేజళ్ళ నవ్య, తెనాలి



మన ప్రాంతానికి పరిచయం లేని ఎన్నో కళలు మరుగున పడుతున్నాయి. ముఖ్యంగా నాన్న స్పూర్తితో సంస్కృతి, సంప్రదాయాలపై ఆసక్తి పెంచుకున్న నేను కళా రంగానికి కాళీ సమయాన్ని కేటాయిస్తాను. ఎందుకంటే ఈ చిత్ర కళ ఏకాగ్రతకు, మానసిక ప్రశాతంతకు దోహదం చేస్తుంది. ఈ కళలను నేర్చుకునేందుకు ఎంతో మంది విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. నాతో పాటు వారిని కూడా ప్రోత్సహిస్తున్నా. వేసవిలో వారికి ప్రత్యేక శిక్షణ కూడా నిర్వహిస్తున్నాను.



మండల ఆర్ట్‌లో నవ్య రూపొందించిన మేడే చిత్రం



మధుబని చిత్రకళలో నవ్య చిత్రరూపం


విద్యార్థులకు ఉచితంగా చిత్రకళలో శిక్షణనిస్తున్న నవ్య , పరిశీలిస్తున్న వేజళ్ళ

నేడు జొన్నకూటి వీర్లంకయ్య సంస్మరణ సభ

ప్రజాశక్తి - తుళ్లూరు



సిపిఎం రాజధాని డివిజన్ నాయకులు జొన్నకూటి వీర్లంకయ్య ద్వితీయ వర్ధంతి సభ సోమవారం జరుగుతుందని సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీర్లంకయ్య స్థూపం వద్ద సిపిఎం రాజధాని డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించిన అనంతరం కమ్యూనిటీ హాల్ వద్ద సాయంత్రం దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, పీడిత, తాడిత ప్రజల ప్రియతమ నాయకులు పుచ్చలపల్లి సుందరయ్య, తుళ్లూరు ప్రాంతంలో సిపిఎం అభివద్ధికి కషి చేసి అమరులైన జొన్నకూటి వీర్లంకయ్య, తాడిపినేని రాఘవయ్య, చవల అంకయ్యల సంస్మరణ సభ జరుగుతుందని, సభలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయవలసిందిగా ఎం రవి కోరారు.



నిత్యజీవితంలో భాగమైన కంప్యూటర్

ప్రజాశక్తి-తాడేపల్లి

టెక్నాలజీ పరంగా కంప్యూటర్ నిజ జీవితంలో భాగమైందని జనవిజ్ఞాన వేదిక నాయకులు శ్రీనివాసరావు చెప్పారు. ఆదివారం పట్టణంలోని సుందరయ్యనగర్ మాలకొండారెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో కంప్యూటర్ శిక్షణ పొందుతున్న విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు. ఐటి కంపెనీల దగ్గర నుంచి ఎక్కడైనా ఏ చిన్న ఉద్యోగంలో చేరాలన్నా కంప్యూటర్ పరిజ్ఞానం అవసరమవుతుందని చెప్పారు. సుందరయ్య నగర్‌లో మాలకొండారెడ్డి ట్రస్టు విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణా తరగతులు నిర్వహించడం పట్ల అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కంప్యూటర్ విద్యకు సంబంధించి స్కిల్స్ విద్యార్థులకు ఆయన నేర్పించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు బాధ్యులు కొట్టె కరుణాకరరావు, ఎస్‌కె బాష పాల్గొన్నారు.



ఇళ్ల స్థల పట్టాల పంపిణీపై సమీక్ష

ప్రజాశక్తి - మంగళగిరి

ఈనెల 26వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వెంకటపాలెం గ్రామంలో ప్రారంభించు ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమం పై ఆదివారం యు.శారదా దేవి అధ్యక్షతన మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏర్పాట్లు తదితర అంశాలపై కమిషనర్ మాట్లాడుతూ మెప్మా, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లతో సమన్వయం చేసుకుని నగర పాలక సంస్థ పరిధి లోని లబ్ది దారులకు ముందస్తు సమాచారం తెలియ జేసి అందరు వచ్చే విధంగా చూడాలని కోరారు. సమీక్షా సమావేశములో నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ కె.హేమమాలిని, తహశీల్దార్ జి.వి.రామ్ ప్రసాద్, మెప్మా అధికారులు, నగరపాలక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణా శిబిరం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక 41వ వార్డు, పుచ్చలపల్లి సుందరయ్య నగర్‌లో పిల్లలకు వేసవి వినోదం పేరుతో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. ముగింపు సందర్భంగా జన విజ్ఞాన వేదిక సభ్యులు ఆర్.స్వాతి శిక్షణలో పాల్గొని విద్యార్థులకు పేపర్లతో బొమ్మల తయారీపై శిక్షణ ఇచ్చారు.



కారర్యక్రమంలో చిల్డ్రన్స్ క్లబ్ సభ్యులు బి.సుకన్య, టీచర్ నవీన తదితరులు పాల్గొన్నారు.

జీవన స్వరాలు పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-తాడేపల్లి

సీతానగరంలోని దేవాదాయ శాఖ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం జీవనస్వరాలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ శ్రీరాము సత్యనారాయణ మాట్లాడుతూ తెలుగు బాష, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో రచయితల పాత్ర ఎక్కువగా ఉంటుందని చెప్పారు. సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఎక్కువగా పాల్గొనే అవకాశం ఇటీవల తనకు కలిగిందని చెప్పారు. మరుగున పడిన అనేక గ్రంథాలను బయటకు తీసుకురావాల్సిన అవసరముందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వెంకటబాలసుబ్రమణ్యం, శ్రీకాంత్, వాసుదేవా నందగిరి, ప్రముఖ న్యాయవాది మన్మథరావు, పలువురు ప్రముఖులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.



నరసరావుపేటలో నేడు మినీ మహానాడు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పల్నాడు జిల్లా మినీ మహానాడును నరసరావుపేటలో సోమవారం నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు తెలిపారు. ఈ మేరకు తన కార్యాలయంలో ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక తీరు, క్షేత్రస్థాయిలో టిడిపి పార్టీని బలోపేతం చేపట్టేందుకు మినీ మహానాడులో ప్రణాళిక రూపొందిస్తామని, శ్రేణులంతా తరలిరావాలని కోరారు.

పూసపాటి బాలాజీకి సత్కారం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

స్థానిక సుబ్బయ్యతోటలోని శ్రీ దత్తసాయి అన్నదాన సమాజం, జయ జయ సాయి ట్రస్ట్, శ్రీ దత్తసాయి సన్నిధి ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పూసపాటి బలాజిని ప్రెస్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట అధ్యక్షులు అడపా అశోక్ కుమార్, ప్రధాన కార్యదర్శి షేక్ దరియవలి అధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. స్థానిక మెడికల్ హాల్ జరిగిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు అశోక్ మాట్లాడుతూ బాలాజీ 12 ఏళ్లుగా ఎన్నో ఆధ్యాత్మిక, సామాజిక సేవ కార్యక్రమాల ద్వారా 90 సేవ పురస్కారాలు, రెండు సార్లు గౌరవ డాక్టరైట్‌లు అందుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ సభ్యులు ఆర్.రాజా, బి.వీరయ్య, కె.చందు, పి.మనోహర్, కె.రమేష్, పి.చిన్న, ఎం.సుధాకర్ పాల్గొన్నారు.



మదర్సా నిర్మాణానికి వితరణ

ప్రజాశక్తి - చిలకలూరిపేట

మండల పరిదిలోని వేలూరులో నిర్మిస్తున్న మదర్సాకు జ్ఞానేశ్వర ఫౌండేషన్ చైర్మన్ షేక్ జాన్‌సైదా రూ.50 వేల విరాళాన్ని ఆదివారం అందించారు. కార్యక్రమంలో 15వ వార్డు కౌన్సిలర్ జాలాది సుబ్బారావు, ఎం.శేషిరెడ్డి, మతపెద్దలు పి.అల్లబక్షు, ఖాదర్‌వలీ, ఖాసింపీరా, సుభానీ, బాజి, నానా, షరీఫ్ బాషా, మీరావలి, కాలేషావలి, పి.కాలేషా, నాగుర్‌వలి పాల్గొన్నారు.

అంగలూరులో తిరునాళ్ల

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని అంగలూరులో శ్రీ నిదానంపాటి లక్ష్మీ అమ్మవారి తిరునాళ్లను ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ చైర్మన్ గోనుగుంట్ల లీలావతి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. తిరుణాళ్ల సందర్భంగా ఆలయం వద్ద భారీ అన్నదానం చేశారు.

కోలాహలంగా జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు

ప్రజాశక్తి - వినుకొండ

సినీ నిర్మాత లగడపాటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆయన నివాసంలో జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలను ఆదివారం నిర్వహించారు. తొలుత అభిమానుల నడుమ భారీ కేక్‌ను కట్ చేసిన లగడపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ జూనియర్ ఎన్టీఆర్ మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు.



వేళాపాళా లేని విద్యుత్ కోతలు

ప్రభుత్వాస్పత్రిలో రోగులకు నానా అవస్థలు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ఉదయం కొంతసేపు.. మధ్యాహ్నం కొంత సేపు.. రాత్రి వేళల్లో మరికంతసేపు ఎప్పుడు విద్యుత్ సరఫరా నిలిపేస్తారో తెలియడం లేదు. వేళాపాళలేని విద్యుత్ కోతలతో జనం సతమతం అవుతున్నారు. ఆస్పత్రుల్లో రోగులకు ఈ సమస్య మరింత తీవ్రంగా మారింది. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఇన్వర్టర్లు, జనరేటర్ల ద్వారా విద్యుత్ సమస్యను కొంత అధిగమిస్తుండగా ప్రభుత్వాస్పత్రిలో రోగులకు మాత్రం తిప్పలు తప్పడం లేదు. ఇప్పటికే రోగాలతో అల్లాడుతుంటే మరోవైపు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ పరిస్థితిని అధిగమించడానికి తామెంతో కృషి చేస్తున్నామని ఆస్పత్రి ఇన్‌ఛార్జి లక్ష్మీకుమారి చెబుతున్నారు. విద్యుత్ కోతలు తరచూ ఉండడం వల్ల ప్రత్యామ్నాయాలు ఆలోచిస్తున్నామని, ఇందులో భాగంగా



ఆస్పత్రిలోని 4 ఇన్వర్టర్లను మరమ్మతు, రీఛార్జి కోసం పంపించామన్నారు. అయితే వాటిల్లో ఎన్ని పని చేస్తాయో తెలియాల్సి ఉందని చెప్పారు. జనరేటర్‌కు గంటకు 5-7 లీటర్ల డీజిల్ అవసరమని, వారానికి రూ.ఐదారు వేలనూ తామే భరిస్తున్నామని చెప్పారు. ఆపరేషన్ వంటి అత్యవసర సమాయాల్లోనే జనరేటర్‌ను వాడుతున్నామని చెప్పారు. ఉక్కపోతతో రోగులు ఇబ్బందులను చూడలేక సొంత డబ్బులతో కూలర్లు ఏర్పాటు చేశామన్నారు.

ఇదిలా ఉండగా ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని ఆమె చెప్పారు. అస్తవ్యస్తంగా ఉన్న ఐసియుని వినియోగంలోకి తేవడంతోపాటు పూర్తిస్థాయిలో ఏసీని అమర్చామన్నారు. తాగునీటి ఆర్‌ఓను ఏర్పాటు చేశామని, దీంతోపాటు రోగులకు చల్లని నీటి కోసం కుంటలనూ సమకూర్చామని చెప్పారు. ఇన్‌పేషెంట్లకు భోజనాలనూ అందించాల్సి ఉందని, ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనానికి రూ.80 ఇచ్చేలా టెండర్లు పిలిచామని తెలిపారు. అది పూర్తయితే రోగులకు భోజనాలకు ఇబ్బంది ఉండదని అన్నారు.



చిలకలూరిపేటలో 8 ఆర్ఆర్ఆర్ కేంద్రాలు

పాత వస్తువులు, వస్త్రాలు ఉంటే ఇవ్వండి.. పేదలకు అందిస్తాం.. : చైర్మన్, కమిషనర్

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పురపాలక సంఘం పరిధిలో 'మేరే లైఫ్ మేరే స్వచ్ఛ సెహర్'లో భాగంగా రెడ్యూస్, రీసైకిల్, రియూస్ (ఆర్.ఆర్.ఆర్) కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం కమిషనర్ సిహెచ్ గోవిందరావు, చైర్మన్ రఫాని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో 8 ఆర్ఆర్ఆర్ సెంటర్లను ఏర్పాటు చేశామని చెప్పారు. ఆర్టీసీ బస్టాండ్, పాత సంత రోడ్డు, గుర్రాలు చావిడి, వేలూరు రోడ్డు, బిఎస్ నారాయణ వీధి, మద్ది నగర్, సుభాని నగర్, పురుషోత్తమపత్నం ప్రాంతాల్లో ఉన్న ఈ కేంద్రాలు వచ్చేనెల 5వ తేదీ వరకూ అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఇళ్లల్లో నిరుపయోగంగా ఉన్న దుస్తులు, బూట్లు, చెప్పులు, పరుపులు, పుస్తకాలు, బ్యాగులు, పిల్లలు ఆడుకునే బొమ్మలు, పాత సైకిళ్లు, మంచాలు, చక్కటేబుళ్లు, విద్యుత్ పరికరాలు, ఇతర సామగ్రిని అందిస్తే వాటిని అవసరం ఉన్న నీరు పేదలకు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎఇలు శ్రీనివాసరావు, జ్యోతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ ఇస్మాయిల్, ఎ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



నిత్యావసరాలు వితరణ

ప్రజాశక్తి - వినుకొండ

ఆర్థికంగా వెనుక బడిన బ్రాహ్మణ కుటుంబాలకు వినుకొండ బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో జీవీ మాధవరావు కార్యాలయం వద్ద బియ్యం, నూతన వస్త్రాలను ఆదివారం పంపిణీ చేశారు. వీటిని సిహెచ్.రాఘవేంద్రరావు, సిహెచ్.భద్రయ్య, పి.బేబీసరోజిని, నారాయణరావు, బి.భాస్కరరావురావు, సిహెచ్. బాబు బాలాజి, వి.విఘ్నేశ్వరి, రామారావు, పి.రవికిరణ్, కె.సత్యనారాయణ సమకూర్చగా ముఖ్య అతిథిగా రాష్ట్ర ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సమితి మాజీ అధ్యక్షులు ముత్తనపల్లి శివక్రిష్ణప్రసాద్, న్యాయవాది జి.నాగేశ్వరావు అందించారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి

ప్రజాశక్తి - వినుకొండ

విద్యుత్తు శాఖలో కాంటాక్ట్ కార్మికులుగా పని చేస్తున్న తాము చాలీచాలని జీతాలతో అనేక కష్టాలు అనుభవిస్తున్నారని, తమను సత్వరమే రెగ్యులరైజ్ చేయాలని 1104 యూనియన్ అధ్యక్షులు కొండలు డిమాండ్ చేశారు. ఈ మేరకు నూజెండ్ల సెక్షన్ కార్యాలయం వద్ద యూనియన్ జెండాను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షులుగా వినకొండకు చెందిన జి.సి.హెచ్ కొండలు, కార్యదర్శిగా ఎ.నిత్యానందం, కార్యనిర్వాహక అధ్యక్షులుగా డి.మన్నయ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు ఎం.వీరాంజనేయులు ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు నరసింహారావు, రామేశ్వర నాయక్, శ్రీనివాసులు, లక్ష్మయ్య, రవికుమార్, అంజిరెడ్డి, వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా పరిమి రాంబాబు

ప్రజాశక్తి-ముప్పాళ్ల



గ్రామ, వార్డు సచివాలయాల పల్నాడు జిల్లా అడ్‌హాక్ కమిటీని పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో ఆదివారం నియమించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ముప్పాళ్ల మండలంలోని బోల్లవరం గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న గోళ్లపాడుకు చెందిన పరిమి రాంబాబు ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నిక పత్రాన్ని రాష్ట్ర నాయకుల నుండి అందుకున్నారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సచివాలయాలకు వచ్చే పౌర సేవల్లో జాప్యం లేకుండా సంఘం తరఫున సమన్వయం చేసినందుకు కృషి చేస్తానన్నారు. నాపై నమ్మకం ఉంచి జిల్లా కమిటీలో అవకాశం కల్పించిన రాష్ట్ర కమిటీకి ధన్యవాదాలు తెలిపారు.

తీరు మార్చుకుని ఇన్‌ఫార్మర్లుగా ఉండండి..

ప్రజాశక్తి - నరసరావుపేట

రౌడీషీటర్లు తీరు మార్చుకోవాలని, ప్రజాశాంతికి విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు తప్పవని నరసరావుపేట డీఎస్పీ కెవి. మహేష్ హెచ్చరించారు. డివిజన్ పరిధిలోని రౌడీషీటర్లకు స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. గతంలో రౌడీషీట్ ఓపెన్ అయి పలు మార్లు కేసులు నమోదైన రౌడీషీటర్లను ప్రత్యేకంగా మందలించారు. వివాదాలకు పాల్పడినా, ప్రోత్సహించినా ఇబ్బందులు ఎదుర్కొంటారని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలు కొనసాగించే రౌడీ షీటర్లపై పోలీసుల నిఘా ఉంటుందన్నారు. సత్‌ప్రవర్తనతో మెలుగుతూ తీరు మార్చుకొని పోలీసులకు ఇన్ఫార్మర్లుగా వ్యవహరించాలని సూచించారు. మంచి నడవడికతో మసులుకుంటే కొన్నేళ్లకు రౌడీషీట్ కొట్టివేస్తామన్నారు.


రైడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ మహేష్

ఫైనల్ మ్యాచ్‌లో సీతా సిసి జట్టు అఖండ విజయం

36 రోజులుగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు - విజేతలకు బహుమతి ప్రదానం

ప్రజాశక్తి-తాడేపల్లి

మండలంలోని పెనుమాక గ్రామంలో జూనియర్ ప్రభుత్వ కళాశాలలో కళ్లం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత 36 రోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. మొత్తం 64 జట్లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్నాయి. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న నాయక్ సిసి జట్టు 78 పరుగులతో అలౌట్ అవ్వగా, అనంతరం లక్ష్య చేదనకు దిగిన సీతా సిసి జట్టు ఒక వికెట్ నష్టానికి 80 పరుగులు చేసి తొమ్మిది వికెట్లతో ఘన విజయం సాధించింది. అనంతరం జరిగిన సభలో టోర్నమెంట్‌ను కైవసం సీతా సిసి జట్టు రూ.లక్ష, రన్నర్స్ నాయక్ సిసి జట్టుకు రూ.50 వేలు, మూడో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.30 వేలు, నాల్గో స్థానం జట్టుకు రూ.20 వేలు ఏపి ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ సిహెచ్.విజయ్ ప్రతాప్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించాలన్నారు. దాతలు ముందుకు వచ్చి టోర్నమెంట్‌లు నిర్వహించి యువతను ప్రోత్సహిస్తేనే మంచి ఆటగాళ్లు తయారవుతారని అన్నారు. టోర్నమెంట్ నిర్వాహకులు కళ్లం గోవిందరెడ్డి మాట్లాడుతూ క్రికెట్ పోటీలు ఉత్సాహభరితంగా, ఉల్లాసంగా జరిగాయన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచే క్రీడాకారులను గుర్తించడమే ఈ పోటీల ముఖ్య ఉద్దేశమన్నారు. కళ్లం ఫౌండేషన్ ఆధ్వర్యంలో టెన్నిస్, క్రికెట్ పోటీలే కాక సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు, ఈ కార్యక్రమంలో కళ్లం టెక్స్‌టైల్స్ మేనేజింగ్ డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి, అడిషనల్ కమిషనర్ స్టేట్ ట్యాక్స్ కృష్ణమోహన్‌రెడ్డి, కళ్లం రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





సన్మానం అందుకుంటున్న కళ్లం ఫౌండేషన్ చైర్మన్ గోవిందరెడ్డి

భవన నిర్మాణ కార్మికుడిని ఆదుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు

పెనుమాకలోని వెంకటేశ్వర దేవస్థానంలో పని చేస్తుండగా, లిఫ్ట్‌తాడు కాలికి తగిలి 45 అడుగుల ఎత్తులో నుండి కింద పడిన బాణావత్ వెంకటేశ్వర నాయక్‌ను ఆదుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, రాజధాని ఏరియా కార్యదర్శి భాగ్యరాజు డిమాండ్ చేశారు. గుంటూరులోని ఉదయ్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న కార్మికుడిని నాయకులు ఆదివారం పరామర్శించారు. నడుము పూర్తిగా విరిగిపోయిందని, గత పది రోజుల నుండి చికిత్స పొందుతున్నా ఎలాంటి మార్పు లేదన్నారు. ఆరోగ్యశ్రీ కూడా లేక లక్షలాది రూపాయలు అప్పు తెచ్చి వైద్యం చేయిస్తున్నారన్నారు. ఇప్పటికైనా గుడి యాజమాన్యం స్పందించి, కార్మికుడు కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం కూడా తగిన సాయం అందించాలని కోరారు. గుడిలో పనిచేస్తూ ప్రమాదానికి గురైన కార్మికుల్ని పట్టించుకోకపోవడం యాజమాన్యం నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. తక్షణమే అధికారులు ఉదయ హాస్పిటల్‌లోఉన్న కార్మికుల్ని పరామర్శించాలని, కార్మికుడి అనారోగ్య స్థితిని పట్టించుకోని యాజమాన్యాన్ని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం ఇప్పటికైనా స్పందించకపోతే పని ఆపి నిరసన తెలియజేస్తామని హెచ్చరించారు.

దామర్ల మోహన్‌కు మాతృవియోగం

ప్రజాశక్తి మంగళగిరి



మంగళగిరి ఆంజనేయ కాలనీకి చెందిన టీడీపీ సీనియర్ నేత, ది మంగళగిరి వీవర్స్ కోఆపరే టివ్ సొసైటీ లిమిటెడ్ మాజీ అధ్యక్షుడు దామర్ల మోహన్ మాతమూర్తి సుశీల (70) ఆదివారం మధ్యాహ్నం కన్ను మూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. సుశీలకు మోహన్ పెద్ద కుమారుడు కాగా, చిన్న కుమారుడి పేరు రమేష్. మంగళగిరి పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు, చేనేత సహకార సంఘాల ప్రతినిధులు సుశీల భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఆమె అంత్యక్రియలు సోమవారం ఉదయం జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

చికాగోలో ఎంపిలు గల్లా,లావు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



అమెరికా దేశంలోని చికాగో లో జరిగిన లెజిస్లేటర్స్ ప్రోగ్రామ్ 2023 లో పార్లమెంట్ సభ్యులు గల్లా జయదేవ్,లావు శ్రీ కష్ణ దేవరాయలు పాల్గొన్నారు. ఎపిక్ ఇండియా, ఎనర్జీ పాలసీ ఇన్స్టిట్యూట్ ఎట్ ది యూనివర్సిటీ ఆఫ్ చికాగో వారు నిర్వహించిన ఈ కార్యక్రమంలో లావు,గల్లాతో పాటు దేశంలోని పలువురు పార్లమెంట్ సభ్యులు పాల్గొన్నారు. పలు వైవిధ్యమైన అంశాలపై.. విశిష్ట అధ్యాపకులు, పారిశ్రామిక నిపుణులు, అనుభవజ్ఞులైన బందం ఆధ్వర్యంలో సమావేశాలు జరిగాయి. భారతదేశ వాతావరణ భవిష్యత్తు, భారతదేశంలో పెరుగుతున్న కాలుష్యాన్ని ఎదుర్కోవటానికి చర్యలు, గ్లోబల్ ఎకనామిక్స్, గ్లోబల్ వాయు కాలుష్య సంక్షోభం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరియు పబ్లిక్ పాలసీలో దాని పాత్ర వంటి అంతర్జాతీయ ప్రాముఖ్యత, భౌగోళిక అంశాలు, ఆరోగ్యం, రాజకీయాలు, ఆర్థిక రంగంపై పలు అంశాలు, సమకాలిన పరిస్థితులకు సంబంధించిన పలు అంశాలపై సమావేశాలు జరిగాయి.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-గుంటూరు

ఉద్యోగుల సమస్యలపై రానున్న రోజుల్లో చేపడుతున్న ఉద్యమాలలో ఉద్యోగులు అందరూ ఐక్యంగా కలిసి రావాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా కోరారు.ఆదివారం సంఘం జిల్లా కార్యాలయంలో ఉద్యోగుల డిమాండ్లతో కూడిన పోస్టర్ ఆవిష్కరించారు. సిపిఎస్ రద్దు చేయాలని, ఓపిఎస్‌ను పునరుద్ధరించాలని, ప్రతి నెల 1వ తేదీన జీతాలు చెల్లించేలా చట్టం చేయాలని, 1993 నవంబర్ 25కు ముందు నియమితులైన ఎన్.ఎమ్.ఆర్. డైలీవేజెస్, కంటింజెంట్ ఉద్యోగులను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని, అన్ని శాఖలలో డిఎస్సీ ద్వారా నియమితులైన కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు మెరుగైన జీతాలు ఇవ్వాలని తదితర ఉద్యోగులు, పెన్షనర్ల డిమాండ్ల సాధనకు రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో సహాధ్యక్షులు మహేష్‌బాబు, కార్య నిర్వాహక కార్యదర్శి కరిముల్లా శాఖాదరి, ఉపాధ్యక్షులు శ్యామ్ కుమార్, సంయుక్త కార్యదర్శి హరికృష్ణ, నగర అధ్యక్షులు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

వాలంటీర్లకు సన్మానం

ప్రజాశక్తి - గుంటూరు



గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో పలు డివిజన్‌లలో ప్రభుత్వ పథకాలను ఇటింట పేదలకు క్రమం తప్పకుండా అందజేస్తున్న వాలంటీర్లకు మద్దాళి గిరి తన సొంత నిధులతో దుస్తులను అందజేసి అభినందించారు. ఆదివారం 18,31వ డివిజన్‌లో వాలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మద్దాళి గిరిధర్‌రావు మాట్లాడారు. రాష్ట్రంలో కులం, మతం, ప్రాంతం చూడకుండా, పార్టీలు, రాజకీయాలతో సంబంధం లేకుండా, వివక్ష, పక్షపాతం చూపకుండా వాలంటీర్లు నిస్వార్థంగా పనిచేస్తున్నారని, గొప్ప సేవలు అందిస్తున్న గ్రామా/వార్డు వాలంటీర్లందరికీ అభినందనలు తెలిపారు. వీరి సేవను గుర్తించి ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రతి సంవత్సరం వాలంటీర్లకు బహుమతిగా సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్రా పురస్కారాల ప్రదానోత్సవ కార్య క్రమం కార్యక్రమంకు శ్రీకారం చుట్టి వారికి గౌరవమిచ్చారని అన్నారు. వాలంటీర్ల మీద కూడా ప్రతిపక్షాల నుంచి అవాకులు చూస్తుంటామని, అయితే ఎలాంటి విమర్శలకు కూడా వెరవవద్దని వాలంటీర్లకు సూచించారు. ప్రభుత్వం మీకు తోడుగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో 19వ డివిజన్ కార్పొరేటర్ తెలుకుట్ల హనుమాయమ్మ, యోగేశ్వర రావు, 31వ డివిజన్ కార్పొరేటర్ అందుగుల సంతోష్, పల్లపు మహేష్ మ్యూజిక్ మరియు డాన్స్ అకడమి డైరెక్టర్ మెరుగ విజయలక్ష్మి పాల్గొన్నారు.


అన్నమయ్య కీర్తనలు ఆలపిస్తున్న డాక్టర్ పురుషోత్తమరావు

అలరించిన అన్నమయ్య సంకీర్తనలు

ప్రజాశక్తి-తెనాలి

పట్టణానికి చెందిన సంకీర్తన సాంస్కృతిక సంస్థ సౌజన్యంతో ఆదివారం స్థానిక కొత్తపేటలోని గ్రాండ్ అతిథి హొటల్‌లో అన్నమయ్య కీర్తనాలాపన నిర్వహించారు. తాళ్ళపాక అన్నమాచార్య 615వ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కె.పురుషోత్తమరావు, పరుచూరి సుబ్బారావు, వి.నరశింహారావు, ఎస్.శివశంకరరాజు, కె.రాజేశ్వరరావు, కె.వసుంధర అన్నమయ్య కీర్తనలను ఆలపించారు. అన్నమయ్య కీర్తనలతో సంగీత ప్రియులు సేదతీరారు. కీర్తనలకు వయోలిన్ సహకారాన్ని జి.ఆంజనేయశాస్త్రి, మృందగాన్ని కె.రామకృష్ణ, వెంకటేశ్వరరావు కీబోర్డు, వంశీ తబలా సహకారాన్ని అందించారు.

ఎయిమ్స్‌లో బాధిత కార్మికులను పరామర్శించిన రాజధాని నాయకులు

ప్రజాశక్తి - మంగళగిరి

నిడమర్రు లే అవుట్ లో టెంట్ కూలి తీవ్ర గాయాలు పాలైన పారిశుధ్య కార్మికులు ఇరువురిని ఎయిమ్స లోని ఐసీయులోకి శనివారం రాత్రి తరలించారు. ఐసీయూలో ఉన్న క్షతగాత్రులు పూజల కొండమ్మ, కె.నాగరాజులను ఆదివారం రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు ఎం రవి ఎయిమ్స హాస్పిటల్‌కి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఐసీయూ వద్దకు వచ్చిన జిల్లా జాయింట్ కలెక్టర్ రాఘవ శర్మను రవి కలిశారు. కొండమ్మ, నాగరాజులు నిరుపేద కుటుంబాలకు చెందిన వారిని, గత ఐదు సంవత్సరాల నుండి వారు నెక్కల్లు గ్రామంలో పారిశుధ్య కార్మికులుగా విధులు నిర్వహిస్తున్నారని, వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జెసి క్షతగాత్రులను పరామర్శించి, అక్కడ డ్యూటీలో ఉన్న వైద్య బృందంతో మాట్లాడారు. వారికి పూర్తిగా నయం అయ్యేవరకు తానే బాధ్యత తీసుకొని డాక్టర్లతో ఫాలోఅప్ చేస్తానని జేసీ హామీ ఇచ్చారుని ఎం రవి తెలిపారు.





తాడేపల్లి పట్టణ వైసిపి అధ్యక్షుని వితరణ

మహానాడులో ఇద్దరికి ఇస్త్రీ, టిఫిన్ బండ్లు పంపిణీ

ప్రజాశక్తి-తాడేపల్లి

మహానాడు ప్రాంతంలో ఇస్త్రీ బండి, టిఫిన్ బండ్లను తాడేపల్లి పట్టణ వైసిపి అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం అందజేశారు. మహానాడులో నివాసం ఉండే వెల్దుర్తి నాగమణికి ఇస్త్రీ బండి, తోట బాబురావుకు టిఫిన్ బండి కోసం వైసిపి నాయకులు వేణుగోపాలసోమిరెడ్డి ద్వారా ఎమ్మెల్యే ఆర్‌కెకు విన్నవించుకున్నారు. దీనికి స్పందించి ఎమ్మెల్యే ఇస్త్రీ బండి, టిఫిన్ బండిని వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.డేవిడ్‌రాజు చేతుల మీదుగా లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ మేకా వెంకటరామిరెడ్డి, ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి చిన్నపోతుల దుర్గారావు, నాయకులు ఎం.ప్రకాష్, బాలసాని అనిల్, బత్తుల దాసు, భూపతి కిషోర్, రాము, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉదయం 9 గంటలకు జిఎంసి స్పందన

ప్రజాశక్తి-గుంటూరు

వేసవి కాలం దృష్ట్యా ప్రజలకు ఇబ్బందులు లేకుండా సోమవారం స్పందనను ఉదయం 9 గంటల నుండి నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో జరిగే స్పందనకు సంబంధించి ఉదయం 8.30 గంటల నుండి ఫిర్యాదుల రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అలాగే ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుండి 5 గంటల వరకు వార్డు సచివాలయాల్లోనూ స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పాపినేని శివశంకర్, సోమేపల్లి, సుబాని తదితరులు

నేలతల్లి రుణం తీర్చుకునేలా రచనలు చేయాలి

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుగ్రహీత పాపినేని శివశంకర్

'మన ఆంధ్రప్రదేశ్ కవితా సంకలనం', 'విత్తనం హైకు సంపుటి' ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు

సుదీర్ఘకాలంగా వర్ధమాన రచయితలను ప్రోత్సహిస్తూ, సామాజిక అంశాలపై ప్రాంతాలకు అతీతంగా సాహితి సేద్యం ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం సేవలు ప్రశంసనీయమని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ పేర్కొన్నారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఆధ్వర్యంలో రచయితల మనోఫలకాలకు స్ఫూర్తి కలిగేలా స్థానిక బృందావన్ గార్డెన్స్ తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం గ్రంథాలయ సందర్శనలో భాగంగా స్థానిక బృందావన్ గార్డెన్స్ అన్నమయ్య గ్రంథాలయ సందర్శనం యాత్ర నిర్వహించారు. అనంతరం ధార్మిక విజ్ఞాన ప్రాంగణంలో 'మన ఆంధ్రప్రదేశ్ కవితా సంకలనం', 'విత్తనం హై కు సంపుటి' పుస్తకాలు ఆవిష్కరించారు. డాక్టర్ శివ శంకర్ మాట్లాడుతూ రచయితలు కన్నతల్లి, పుట్టిన నేల, రుణాలు తీర్చుకునేలా స్వాభిమానం దెబ్బతినకుండా తమ రచనలు చేయాలన్నారు. సామాజిక స్పహతో సత్యాన్ని, యదార్థతలకు మాత్రమే ప్రాధాన్యతనిస్తూ సమ్మిళిత దృక్పథంతో రాయాలని కోరారు. సభకు అధ్యక్షత వహించిన ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షులు సోమేపల్లి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ రచయితలకు కావలసిన అంశాలు గ్రంథ భాండాగారాలలో సాహిత్య సౌరభాల తోటలు విరబూస్తుంటాయని తెలియజేశారు. ప్రముఖ సాహిత్య వేత్త డాక్టర్ వెలుఓలు నాగరాజ్యలక్ష్మి అన్నమయ్య గ్రంథాలయ ప్రాశస్త్యాన్ని వివరించగా, గ్రంథాలయ రూపశిల్పి లంకా సూర్యనారాయణను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వెంకట శ్రీనివాసులు, నెల్లూరు అధ్యక్షులు జయప్రకాష్, జనని సంస్థ చెన్నై ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య, సాహితీవేత్త లలితానంద్, గుంటూరు జిల్లా కార్యదర్శి ఎస్ఎం సుభాని తదితరులు పాల్గొన్నారు.

చంద్ర నిప్పుల పూలు శేషేంద్ర కవితలు

ప్రముఖ కవి, సాహతీ విమర్శకులు రావి రంగారావు

ప్రజాశక్తి-గుంటూరు

చంద్ర నిప్పుల పూలు గుంటూరు శేషేంద్రశర్మ కవితలు అని ప్రముఖ కవి, సాహిత్య విమర్శకులు డాక్టర్ రావి రంగారావు అన్నారు. ఆదివారం స్థానిక బ్రాడీపేట సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో 'అమరావతి సాహితీమిత్రులు' నిర్వహించిన సాహిత్య సభలో ఆయన 'గుంటూరు శేషేంద్ర శర్మ సాహిత్య వైభవం' గురించి ప్రసంగించారు. కవి అనుభూతి చాలా సున్నితంగా ఉంటూనే, వ్యక్తీకరణ చాలా బలంగా ఉంటుందని, అందమైన ప్రకతి దశ్యాలను ఆధునిక విప్లవ భావాల ప్రచారానికి వినియోగించుకొన్న ప్రత్యేక రచనా శిల్పం ఆయన సొంతం అని ప్రశంసించారు. దేశంలో దుస్థితుల్ని చూసి 'చెట్లు పూలు కాదు, బుల్లెట్లు పూయా' లని కాంక్షించారన్నారు. 'నేను చెమట బిందువును, కండల కొండలలో ఉదయించేలోక బంధువును, గుండెలతో నాకు దోస్తీ, నేనుండేది బాధల బస్తీ' అని ప్రకటించుకున్నారని తెలిపారు. 'ఈ ఏడాది మొలిచిన పైర్లకు దుఃఖం తీరకపోతే వచ్చే ఏడాది కొడవళ్ళు పట్టుకున్న పిడికిళ్ళు మొలుస్తాయి' అని రైతు పోరాటాల్ని ముందుగానే పసిగట్టారన్నారు. సంస్థ కన్వీనర్ పింగళి భాగ్య లక్ష్మి అధ్యక్షత వహించారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కవితల పోటీలో విజేత కుప్పిలి వెంకట రాజారావు (ఆముదాలవలస, శ్రీకాకుళం జిల్లా) ఈ మాసం కవిగా కూడా పాల్గొని వినిపించిన అనేక కవితలు విశేషంగా అలరించాయి. కార్యక్రమంలో ఎస్‌చ్‌ఓ వ్యవస్థాపకులు డాక్టర్ టి. సేవాకుమార్, కన్వీనర్ పింగళి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వెంకట రాజారావును సన్మానిస్తున్న రావి రంగారావు, డాక్టర్ సేవాకుమార్, భాగ్యలక్ష్మీ తదితరులు

విద్యార్థులూ... సెలవుల్లో లైబ్రరీకి వెళ్లండి

పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్

గ్రంథాలయంలో విద్యార్థులతో కలసి పుస్తకాలు చదివిన కలెక్టర్



విద్యార్థులతో గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి - నరసరావుపేట

విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని దగ్గరగాఉన్న గ్రంధాలయాలను సందర్శించి అక్కడ అందుబాటులో ఉన్న కరెంట్ ఎఫ్పైర్స్, సామాజిక స్పహ అందించే పుస్తకాలను చదవాలని పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ కోరారు. ఆదివారం పల్నాడు రోడ్డులోని శాఖా గ్రంధాలయాన్ని ఆయన సందర్శించారు. లైబ్రరీలోని పుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పలు విషయాలను ముచ్చటించారు. వారికి పలు విషయాలు తెలిపారు. గ్రంధాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని పుస్తక పఠనం ద్వారా జ్ఞాన సంపదతో పాటు మానసికాభివద్ధి సొంతం చేసుకోవచ్చని పూర్వీకులు ఏనాడో విశ్వసించారని, ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. విద్యార్థులు చేతి వ్రాత మెరుగు పర్చుకోవడం, స్పోకెన్ ఇంగ్లీష్, బొమ్మలు వేయడం నేర్చుకోవాలన్నారు. విపరీతమైన ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో బయట ఆటలకు వెళ్లడం, చారవాణి తో గడపడం వంటివి మానుకోవాలని విద్యార్థులకు సూచించారు. విజ్ఞాన దాయకమైన పుస్తకాలు సేకరించడం ఖర్చుతో కూడుకున్న వ్యవహారం అయిన నేపథ్యంలో దీనికి పరిష్కారమే గ్రంథాలయాలు అని పేర్కొన్నారు. విద్యా, విజ్ఞానం, మహనీయులు రచించిన గాధలు, పిల్లల కోసం బాలల పుస్తకాలను అందరికీ అందుబాటులో ఉంచాలని గ్రంథాలయ శాఖ సిబ్బందికి సూచించారు. వేసవిలో చిన్నపిల్లల పుస్తక పఠనం పై ఎక్కువ మక్కువ ఉండేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. గ్రంధాలయం మొత్తాన్ని తిరిగి అందుబాటులో ఉన్న పలు పుస్తకాలను జిల్లా కలెక్టర్ చదివారు. వేసవిలో పిల్లలు, పెద్దలు అమితంగా ఇష్టపడి చదివే పుస్తకాల తో పాటు వారికి ఇష్టమైన కార్యక్రమాలను నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో శాఖా గ్రంధాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

చురుగ్గా భూముల రీసర్వే

173 గ్రామాల్లో డ్రోన్‌తో పరిశీలన - రైతుల సమక్షంలో హద్దు రాళ్ల ఏర్పాటు

ప్రజాశక్తితో జిల్లా సర్వే అధికారి రూప్లానాయక్





ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

జిల్లాలో జగనన్న భూ హక్కు, భూ రక్ష పథకం ద్వారా 173 గ్రామాల్లో భూముల రీ సర్వే జరుగుతుందని జిల్లా సర్వే, భూమి రికార్డుల అధికారి ఇ.రూప్లానాయక్ తెలిపారు.ఇప్పటి వరకు ఐదు గ్రామాల్లో ఈ సర్వే పూర్తయిందని రైతులకు నూతన వివరాలతో పట్టాదారు పాసు పుస్తకాలను రెవెన్యూ అధికారులు ఇస్తారని ఆయన తెలిపారు. ప్రజాశక్తి ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు తెలియజేశారు.

జిల్లాలో భూముల విస్తీర్ణం ఎంత?

223 గ్రామాల్లో 5.95 లక్షల ఎకరాల భూమిఉంది. మంగళగిరి, తాడేపల్లి కార్పొరేషన్ లో కలిపిన గ్రామాలతోపాటు, సిఆర్‌డిఏ పరిధిలోని 29 గ్రామాల్లో సర్వే జరగడం లేదు. మొత్తంగా 50 గ్రామాల్లో సర్వే పనులు మినహాయించారు. మిగతా 173 గ్రామాల్లో రీ సర్వే పనులు చురుగ్గా జరుగుతోంది.

ఇప్పటివరకు ఎన్ని గ్రామాల్లో పూర్తయింది?

జిల్లాలో తొలి విడత ఐదు గ్రామాల్లో సర్వే చేపట్టాం. ఈ ఐదు గ్రామాల్లో పూర్తయింది. పత్తిపాడు మండలం కొండజాగర్లమూడి, దుగ్గిరాల మండలం దేవరపల్లి అగ్రహారం, శృంగాపురం, చింతలపూడి, చేబ్రోలు మండలం మీసర గడ్డ అనంతవరం గ్రామాల్లో సర్వే పూర్తి చేశాం.రెండో దశలో 25గ్రామాల్లో డ్రోన్ ఫ్లై సర్వే పూర్తయింది. మూడో దశలో 148 గ్రామాల్లో సర్వే ప్రారంభం అయింది. మొత్తంగా 123 గ్రామాల్లో డ్రోన్ ఫ్లై సర్వే పూర్తి చేశాం. రెండో దశలో ఎన్ని గ్రామాల్లో పూర్తి అయింది.రెండోదశలో 25 గ్రామాల్లో చేపట్టాం. 14 గ్రామాల్లో సర్వే నోటిఫికేషన్ ఇచ్చాం. 7 గ్రామాల్లో పూర్తి స్థాయిలో ఆర్ఓఆర్ జారీ చేశాం.

హద్దులు కచ్చితంగా నిర్ధారిస్తున్నారా?

డ్రోన్ సర్వేలో ప్రతి భూమికి ఇమేజ్‌స్ వస్తాయి. ఉన్న భూమికి ఉన్నట్టుగా హద్దులు కన్పిస్తాయి. వాటిల్లో తేడాలు ఉంటే అభ్యంతరాలు స్వీకరిస్తాం. డ్రోన్ ఫ్లై సర్వేలో వచ్చిన చిత్రాల ఆధారంగానే హద్దులు నిర్ణయిస్తాం. హద్దులను ఖచ్చితంగానే పొందుపరుస్తున్నాం.

రైతులకు ఎలా తెలియజేస్తారు?

సర్వే గురించి విఆర్ఓలు, వాలంటీర్ల ద్వారా రైతులకు సమాచారం ఇస్తారు. ప్రస్తుతం ఉన్న హద్దుల్లోనే రాళ్లు ఏర్పాటు చేస్తారు.ఏదైనా మార్పులు ఉంటే రైతులకుతెలియజేస్తాం. రెవెన్యూ అధికారుల సమక్షంలోనే హద్దు రాళు ఏర్పాటు చేస్తారు. హద్దుల్లోతేడాలు కన్పిస్తే రెవెన్యూ అదికారులకు ఫిర్యాదు చేయవచ్చు.

సర్వే జాప్యం కావడానికి కారణం?

గ్రామాల్లో భూ యజమానులు అందుబాటులో ఉండటం లేదు. భూ యజమానులు ఇతర రాష్ట్రాలు,ఇతర దేశాల్లో ఉన్న వారు ఉన్నారు.కొంత మంది ఇతరపట్టణాల్లో ఉంటారు.వీరికి సమాచారం ఇచ్చి వీరిని రప్పించి వారి డాక్యుమెంట్స్ పరిశీలించి సర్వేల్లో వచ్చిన ఫోటోలు, వివరాల ఆధారంగా రాళ్లు ఏర్పాటు చేయాల్సి వస్తోంది.

భూముల వివరాలు నమోదుకు ప్రామాణికం?

శాటిలైట్ ఇమేజ్‌స్ తీసుకుంటాం. అక్షాంశాలు, రేకాంశాల ఆధారంగా వివరాలు నమోదు చేస్తారు. వీటిల్లో ఉన్న వివరాలకు, భూముల డాక్యుమెంట్స్‌కు మధ్య తేడా ఉంటే ఫిర్యాదు చేయవచ్చు.విచారణకు ఒక మొబైల్ మేజిస్ట్రేట్ ఉన్నారు. ఆయన రికార్డులు పరిశీలించి నిర్ణయం ప్రకటిస్తారు. పత్రాలకు తగ్గట్టుగా ఆధారాలు కూడా ఇవ్వాలి. గ్రౌండ్ రియాల్టిని తప్పని సరిగా పరిశీలిస్తారు.